నేటి కందం- నేటికి అందం

నప్పగ వ్యక్తుల నటు నిటు
త్రిప్పక సుప్రీము కోర్టు తీర్పుల నొసగన్
చప్పున కేంద్రము పెంచెను
ముప్పది యెనిమిదికి న్యాయమూర్తుల సంఖ్యన్ !!

(తీర్పుల్లో జాప్యాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 38 కి పెంచింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక


దక్షణాది తప్ప మిగితా
దేశమంతా పరుగులు
కారణాలు ఏవైనా
కాషాయం మెరుగులు.
రాష్ట్రాల సమాఖ్యగా
రాజ్యముంటే ప్రమోదం
ఏకపార్టీ నియంతృత్వ
ఏలికుంటే ప్రమాదం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 8-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:212 పేజీలు:6 వెల: రూ.1/-


## బిహార్‌లో మంత్రివర్గ విస్తరణ.. నితీష్ కుమారుడికి చోటు..



న్యూఢిల్లీ, మే 7:బిహార్‌లో ఎన్‌డీయే ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణ గురువారం జరిగింది. మొత్తం 32 మందితో కొత్త మంత్రులతో కూడిన పూర్తిస్థాయి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రస్తుతం బిహార్‌లో బీజేపీ, జేడీయూ, ఇతర పార్టీలతో కలిసి ఎన్‌డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. మంత్రి వర్గ విస్తరణలో మాజీ సీఎం నితీష్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్‌కు చోటు దక్కింది. కూటమిలో బీజేపీకి 15, జేడీయూకు 13, రామ్ విలాస్ ఎల్జేపీకి 2, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం పార్టీలకు ఒక్కో మంత్రి పదవి దక్కింది.

కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం పాట్నాలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్, మాజీ సీఎం నితీష్ కుమార్ హాజరయ్యారు. అలాగే కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ, లాలాన్ సింగ్, ఆర్ఎల్ఎం, ఇతర పార్టీల నేతలు కూడా పాల్గొన్నారు. 2025లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి 202 సీట్లు గెలుచుకుంది. బీజేపీ, జేడీయూ కలిపి 174 సీట్లు సాధించాయి. కొత్త మంత్రుల పూర్తి జాబితా ఇది.

విజయ్ కుమార్ సిన్హా (బీజేపీ), దిలీప్ జైశ్వాల్ (బీజేపీ), రామ్ కృపాల్ యాదవ్ (బీజేపీ), నితీష్? మిశ్రా (బీజేపీ), మితిలేష్? తివారి (బీజేపీ), కేదార్ గుప్తా (బీజేపీ), రామా నిషద్ (బీజేపీ), ప్రమోద్ కుమార్ చంద్రవంశి (బీజేపీ), లాఖేంద్ర కుమరా రౌషన్ (బీజేపీ), సంజయ్ సింగ్ టైగర్ (బీజేపీ), కుమార్ శైలేంద్ర (బీజేపీ), రామచంద్ర ప్రసాద్ (బీజేపీ), శ్రేయాసి సింగ్ (బీజేపీ), నంద కిషోర్ (బీజేపీ), అరుణ్ శంకర్ ప్రసాద్ (బీజేపీ), శ్రావణ్ కుమార్ (జేడీయూ), అశోక్ చౌదరి (జేడీయూ), లేషీ సింగ్ (జేడీయూ), మదన్ సాహ్నీ (జేడీయూ), మొహమ్మద్ జామా ఖాన్ (జేడీయూ), సునీల్ కుమార్ (జేడీయూ), శీలా మండల్ (జేడీయూ), రత్నేష్? సదా (జేడీయూ), బూలో మండల్ (జేడీయూ), భగవాన్ సింగ్ కుష్వాహా (జేడీయూ), దామోదర్ రావత్ (జేడీయూ), నిశాంత్ కుమార్ (జేడీయూ), శ్వేతా గుప్తా (జేడీయూ), సంజయ్ పాశ్వాన్ (ఎల్‌జేపీ–ఆర్వీ), సంజయ్ సింగ్ (ఎల్‌జేపీ–ఆర్వీ), సంతోష్ సుమన్ (హెచ్ఏఎం -ఎస్), దీపక్ ప్రకాశ్ (ఆర్ఎల్ఎం).

## ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్న తమిళనాడు గవర్నర్: టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, మే 07: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు

108 స్థానాలు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు.

గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా.. లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా.. అంటూ సందేహం వ్యక్తం చేశారు.

తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు.

కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని ఈ సందర్భంగా గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు.

కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

### తమిళనాడు గవర్నర్ వైఖరిపై కాంగ్రెస్ ఆగ్రహం.. నేడులోక్‌భవన్ ముట్టడికి పిలుపు

చెన్నై, మే 7: తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు అంశం ఇప్పుడు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోంది. అత్యధిక స్థానాలు సాధించిన ఎంఐ అధినేత విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రేపు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది.

తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (ఎఔఅఅ) గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రేపు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం (లోక్ భవన్)ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది.గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీరు కేవలం కాలయాపన చేయడమేనని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉన్న ఎంఐకి, కాంగ్రెస్ (5 సీట్లు) వామపక్షాల మద్దతు కలిపితే మెజారిటీకి చేరువలో ఉన్నామని, ఈ తరుణంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. 'ప్రజలు మార్పును కోరుకున్నారు, కానీ గవర్నర్ మాత్రం ఢిల్లీ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

## ఉగ్రస్థావరం ఏదీ సురక్షితం కాదని ఆపరేషన్ సింధూర్‌తో తేలిపోయింది: భారతీయ మిలిటరీ

జైపూర్:, మే 7:ఆపరేషన్ సింధూర్ చేపట్టి నేటితో ఏడాది పూర్తి అయ్యింది. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలను ఇండియన్ మిలిటరీ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జైపూర్‌లో ఇవాళ జరిగిన ఓ కార్యక్రమంలో త్రివిధ దళాలకు చెందిన చీఫ్‌లు మీడియా సమావేశంలో మాట్లాడారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరం ఏది కూడా సురక్షితమైంది కాదు అని ఆపరేషన్ సింధూర్ ద్వారా నిరూపించామని భారతీయ మిలిటరీ పేర్కొన్నది. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆ మిషన్ కేవలం ప్రారంభం మాత్రమే అని మిలిటరీ చెప్పింది. ఆపరేషన్ సింధూర్‌కు చెందిన వివిధ రకాల అంశాలను ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీకి చెందిన చీఫ్‌లు వెల్లడించాయి. ఆపరేషన్ సింధూర్ ముగింపు కాదు అని, అది ఆరంభం మాత్రమే అని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ తెలిపారు.

డీజీఎంవో స్థాయిలో ఆ ఆపరేషన్‌ను ఘాయ్ చేపట్టారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని ఉన్న పాకిస్థానీ స్థావరాలను ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. చాలా కచ్చితత్వంతో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. భారత తన సార్వభౌమాధికారాన్ని, భద్రతను, ప్రజలను కాపాడుకుంటుందని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలు ఏవి కూడా క్షేమం కాదు అని ఆపరేషన్ సింధూర్‌తో తెలిసిందన్నారు. ప్లాన్ చేశామని, పక్కాగా అమలు చేశామని, మల్టీ డొమెయిన్ ఆపరేషన్‌ను అసాధారణ రీతిలో పూర్తి చేశామని ఘాయ్ తెలిపారు.

ఎయిర్ మార్షల్ ఏకే భారతి మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్ తన వైమానిక సత్తా చాటిందన్నారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై మే 7వ తేదీన దాడి చేశామన్నారు. మే 10వ తేదీన రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం కుదిరిందన్నారు.

## హోర్ముజ్ జలసంధి దాటిన 11భారత నౌకలు.. 3 నౌకలు అక్కడే.. విదేశాంగ శాఖ ప్రకటన



న్యూఢిల్లీ, మే 7: ఇరాన్–అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హోర్ముజ్ జలసంధిని మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇండియా సహా అనేక దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధి వద్దే చిక్కుకుపోయాయి. ఈ నేపథ్యంలో జలసంధిలో చిక్కుకుపోయిన భారత నౌకలపై కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై ప్రకటన చేశారు.

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 11 భారత నౌకలు జలసంధిని దాటాయని ఆయన వెల్లడించారు. ఇంకా 13 నౌకలు పర్షియన్ గల్ఫ్ వద్ద చిక్కుకుపోయినట్లు తెలిపారు. మిగిలన నౌకలు తిరిగి ఇండియా సురక్షితంగా చేరేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు జైశ్వాల్ చెప్పారు. ఈ విషయంలో ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపుల తర్వాత ఇండియా ఈ అంశంలో ముందడుగు స్థితిలోనే ఉందన్నారు. 11 నౌకలు హోర్ముజ్ నుంచి సురక్షితంగా ఇండియా చేరాయన్నారు. మిగిలిన నౌకల్ని కూడా ఇండియా రప్పించేందుకు ఇరాన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

అంతర్జాతీయ చమురు రవాణాకు సంబంధించి హోర్ముజ్ జలసంధి అత్యంత కీలకం అనే సంగతి తెలిసిందే. హోర్ముజ్ మూసివేయడంతో అనేక దేశాలు చమురు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఇండియా సహా అనేక దేశాలు ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం అనేక దేశాలకు చెందిన నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయి.

## TG EAPCET-2026 ఇంజినీరింగ్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్, మే 7: TG EAPCET-2026 ఇంజినీరింగ్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్షలు మే 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మే 9, 10, 11 తేదీల్లో మొత్తం 6 సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 125 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది మొత్తం 2,10,766 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకున్నారు. మార్నింగ్ సెషన్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆఫ్టర్నూన్ సెషన్ పరీక్షలు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. అభ్యర్థులు ముందుగానే తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.హాల్ టికెట్‌లో పేర్కొన్న తేదీ, సెషన్, పరీక్షా కేంద్రాన్ని తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం సెషన్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7:30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్న సెషన్‌లో పరీక్ష రాసే విద్యార్థులను మధ్యాహ్నం 1:30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9 గంటల తర్వాత, అలాగే మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి ఉండదని హెచ్చరించారు.

## మహిళా స్వయం సహాయక బృందాలకు గుడ్ న్యూస్



హైదరాబాద్, మే07: మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు.

మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం వంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు.

ఈ ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు.

పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానని ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధ చూడ లేక తాను తుపాకీ పట్టానని వివరించారు. ఆ అనుభవంతోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క తెలిపారు.

ఇప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.

నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ (ఔఖం) సాధించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని మంత్రి సీతక్క అభినందించారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు వంద శాతం బ్యాంకులకు రీపేమెంట్ చేయాలని సూచించారు. బ్యాంకర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టాలని మహిళా సంఘాలకు మంత్రి స్పష్టం చేశారు.

మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బ్యాంకర్లకు మంత్రి సూచించారు. బ్యాంకులకు తాము గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత తమదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని.. అదే మహిళా శక్తికి సహకరిస్తే మీ నగదుకు భద్రత లభిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, మే 07: రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు.

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు.

ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటా మన్నారు.

ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

## సవతి సోదరుడి మార్క్‌షీట్‌ను మార్పు చేసిన బాలిక.. హత్య చేసిన తండ్రి

ముంబై, మే 7: సవతి సోదరుడి మార్క్‌షీట్‌ను ఒక బాలిక మార్పు చేసింది. ఇది తెలుసుకున్న ఆమె తండ్రి ఆగ్రహించాడు. చెక్క కోసే యంత్రంతో కుమార్తెను హత్య చేశాడు. ఆ బాలిక మృతదేహానికి నిప్పంటించాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దేవుల్‌గావ్ రాజే గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలిక స్కూల్ పరీక్షల్లో రెండో స్థానంలో నిలిచింది. ఆమె సవతి సోదరుడు ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ నేపథ్యంలో అతడి మార్క్‌షీట్‌లోని మార్కులను ఆ బాలిక మార్చివేసింది.కాగా, తండ్రి శాంతారామ్ దుర్యోధన్ చవాన్‌కు ఈ విషయం తెలిసింది. ఆగ్రహించిన అతడు చెక్క కోసే యంత్రంతో కుమార్తెను హత్య చేశాడు. బాలిక మృతదేహాన్ని వస్త్రంలో చుట్టి నిప్పంటించాడు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. పాక్షికంగా కాలిన బాలిక మృతదేహాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తండ్రి శాంతారామ్ దుర్యోధన్ చవాన్, సవతి తల్లి చింకీ భోంస్లేను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# మానవత్వ స్థాపన దిశగా అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ

## (08 మే "ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం" సందర్భంగా)

నోబెల్ శాంతి బహుమతి-1901 గ్రహీత హెన్రీ డ్యునాంట్ 1864లో నిర్వహించిన జెనీవా సమావేశంలో తీర్మానించిన ప్రకారం అంతర్జాతీయ మానవీయ దాతృత్వ స్వచ్ఛంధ సంస్థగా రెడ్ క్రాస్ ప్రారంభం కావడం, 192 నేషనల్ సొసైటీస్గా విస్తరించి 17 మిలియన్ల స్వచ్ఛంధ కార్యకర్తలతో నేడు ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంధ సంస్థగా నేటికీ అప్రతిహతంగా తన మానవీయ సేవలకు ప్రపంచ నలుమూల విస్తరించి కొనసాగుతున్నది. హెన్రీ డ్యునాంట్ జన్మదినం 08 మే రోజున ప్రతి ఏట "ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం" పాటించుట 1948 నుంచి ఆనవాయితీగా మారింది. "మానవత్వంతో శాంతి స్థాపన వైపు (విత్ హుమానిటీ, టువర్డ్స్ పీస్)" అనే నినాదంతో ఒక తటస్థ, నిష్పాక్షిక మానవీయ సంస్థగా రెడ్ క్రాస్ నేడు ప్రపంచవ్యాప్తంగా తన సేవా హస్తాలను విస్తరించి ముందుకు సాగుతోంది.

### ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం-2026:

ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం-2026 ఇతివృత్తంగా "మానవీయతను సజీవంగా ఉంచడం (కీపింగ్ హుమానిటీ ఎలైవ్)" అను అంశాన్ని తీసుకోని అవగాహన కార్యక్రమాలను రూపొదించారు. రెడ్ క్రాస్ స్వచ్ఛంధ సేవకులు ప్రతికూలమైన ప్రమాదకరమైన మారుమూల ప్రాంతాల్లో సహితం ధైర్యంగా తమ అత్యవసర సేవలైన ఆహారాన్ని అందించి ఆకలి చావులు ఆపడం, ప్రకృతి వైపరీత్యాల సమయం అవసర సేవలు అందించడం, వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవడం, యుద్ధ బాధితులను ఆదుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆపన్నహస్తం అందించడం, అంటువ్యాధులు ప్రభలినపుడు రక్షణ గొడుగుగా నిలవడం లాంటి అసంఖ్యాక అత్యవసర సేవలను కొనసాగిస్తున్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం రోజున రెడ్ క్రాస్ స్వచ్ఛంధ సేవకుల త్యాగం, అంకితభావం, ధైర్యాలను కొనియాడుతూ వారిని సముచితంగా గౌరవించుకోవడం మానవత్వం కలిగిన పౌర సమాజ కనీస బాధ్యత.

### రెడ్ క్రాస్ సంస్థ మౌళిక సూత్రాలు:

ఏడు మౌళిక సూత్రాల పునాదిగా రెడ్ క్రాస్ సొసైటీలు ఏర్పడ్డాయి. మానవత్వం, నిష్పక్షపాతం, తటస్థ స్థితి, స్వయం ప్రతిపత్తి, స్వచ్ఛంధ సేవలు, ఏకత, విశ్వవ్యాప్తం అనబడే ఏడు ప్రధాన సూత్రాల ఆధారంగా రెడ్ క్రాస్ సొసైటీల సేవలు నిరాటకంగా, వేగంగా కొనసాగుతున్నాయి. భారతీయ రెడ్ క్రాస్ సేవలు దాదాపు 1100ల సొసైటీల ద్వారా తమ సేవలను కొనసాగిస్తున్నాయి. నిత్యం జరిగిగే సేవా కార్యక్రమాల్లో రక్త దాన శిబిరాల నిర్వహణ, అవసర పేదలకు కనీస ధరలకు రక్తాన్ని అందించడం "రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్"ల ద్వారా కొనసాగుతున్నది.

సహజ విపత్తులు, యుద్ధ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు సహితం ముందుగా చేరి తమ అమూల్య సేవా హస్తాలను అందిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ సదా మానవీయతను, ప్రేమను నింపుకున్న అమ్మ వలె ఆపన్నహస్తం అందించాలని కోరుకుందాం, అనుకూలంగా ఉంటే రెడ్ క్రాస్ కార్యకర్తగా పేరు నమోదు చేసుకొని సేవకులుగా మారుదాం, మానవత్వాన్ని నిలుపుదాం.



-మధుపాలీ
9949700037

# ప్రపంచ వస్త్ర మార్కెట్లలో పోటీతత్వం దిశగా రూ.5659.22 కోట్లతో

## "పత్తి ఉత్పాదకత మిషన్"కు కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, మే 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఇవాళ దేశంలో పత్తి సాగు-ఉత్పాదకతకు సంబంధించి వృద్ధి-నాణ్యతల క్షీణత, అవరోధాలు తదితర సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ప్రణాళికకు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు (2026-27 నుంచి 2030-31) ఐదేళ్లపాటు రూ.5659.22 కోట్లతో "పత్తి ఉత్పాదకత మిషన్" అమలుకు సమ్మతి తెలిపింది.

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 5 'ఎఫ్' (ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారిన్) దృక్కోణానికి అనుగుణంగా ఈ కార్యక్రమం అమలవుతుంది. పత్తి సాగులో చీడపీడలను, తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే రకాల (హెచ్‌వైవీ) విత్తనాల రూపకల్పనపై ఈ కార్యక్రమం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల (రాంజ) ద్వారా ప్రస్తుత, సరికొత్త పంట ఉత్పత్తి సాంకేతికతలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుంది. ఈ విధానాల అనుసరణ, విస్తరణ సహా జౌళి పరిశ్రమకు స్వల్ప మాలిన్య పత్తి సరఫరాకు భరోసా, అధిక నాణ్యతగల పత్తి ఎగుమతికి ప్రోత్సాహం తదితర లక్ష్యాలతో ఉత్పాదకత పెంపు దీని ధ్యేయం.

కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమ, జౌళి మంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా అమలు చేస్తాయి. ఈ మేరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) పరిధిలోని 10 సంస్థలు, కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ పరిధిలోగల ఒక సంస్థ, పత్తి ప్రధాన పంటగాగల రాష్ట్రాల్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలలోని ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కిందనున్న 10 పత్తి కేంద్రాలు ఇందులో భాగస్వాములుగా ఉంటాయి. రాష్ట్రాల్లోని వ్యవసాయ మంత్రిత్వశాఖ, 'ఐకార్'ల ద్వారా 14 రాష్ట్రాల్లోని 140 జిల్లాలపై తొలుత దృష్టి సారిస్తారు. సాంకేతికతల ఉన్నతీకరణ, 2000 జిన్నింగ్-ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల ఏర్పాటు దీని ప్రధాన ధ్యేయం. అధిక దిగుబడినిచ్చే, వాతావరణ మార్పులను, తెగుళ్లను తట్టుకోగల వంగడాల రూపకల్పన, ఆధునిక వ్యవసాయ సాంకేతికతల అనుసరణ, రైతులకు శిక్షణ, నాణ్యత మెరుగుదల, ట్రేసబిలిటీ, పత్తి విలువ వ్యవస్థ అంతటా సుస్థిర ఫైబర్లు, ఆవిష్కరణలకు ప్రోత్సాహంతో మౌలిక సదుపాయాలను బలోపేతం వంటివి దీని లక్ష్యాలు.

దేశంలో 2031 నాటికి పత్తి ఉత్పాదకతను హెక్టారుకు 440 కిలోల నుండి 755 కిలోలకు పెంచడం ద్వారా 498 లక్షల బేళ్ల (ఒక్కోటి 170 కిలోలు) ఉత్పత్తి ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. తద్వారా సుమారు 32 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగడంతో వారు స్వావలంబన సాధిస్తారు. ట్రేసబిలిటీ-సర్టిఫికేషన్ దిశగా 'కస్తూరి కాటన్ భారత్'కు ప్రోత్సాహం, వ్యర్థాలను 2 శాతంకన్నా దిగువకు నియంత్రించడం ఇందులో అంతర్భాగంగా ఉంటాయి. అలాగే అవిసె, రామీ, సిసల్, మిల్క్‌వీడ్, వెదురు, అరటి వంటి సహజ నార ఉత్పత్తులకు ప్రోత్సహించడం ద్వారా పత్తి రంగంలో దేశాన్ని స్వయంసమృద్ధం చేసే దిశగా ఇదొక కీలక మలుపు అవుతుంది.

# రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా 3 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు మంత్రిమండలి ఆమోదం

న్యూ ఢిల్లీ, మే 7:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ ఇవాళ రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలో రూ.23,437 కోట్లతో చేపట్టే 3 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులలో:

ఈ మార్గాల్లో లైన్ల సామర్థ్యం పెరుగుదల ద్వారా రవాణా సౌలభ్యంగా గణనీయంగా మెరుగవుతుంది. దీంతోపాటు భారతీయ రైల్వే కార్యాచరణ సామర్థ్యం, సేవా ప్రదానంలో విశ్వసనీయత ఇనుమడిస్తాయి. కార్యకలాపాల క్రమబద్ధీకరణ, రద్దీ తగ్గింపు లక్ష్యంగా ఈ మల్టీ-ట్రాకింగ్ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చనున్నాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'నవ భారత్' దార్శనికతకు అనుగుణంగా ఇవి రూపొందుతున్నాయి. ఈ ప్రాంతాల సమగ్రాభివృద్ధి ద్వారా అక్కడి ప్రజలను 'స్వయంసమృద్ధం' చేయడం ద్వారా వారి ఉపాధి/స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

సమగ్ర ప్రణాళిక, భాగస్వాములతో సంప్రదింపుల ద్వారా బహుళ రవాణా సాధనాల అనుసంధానాన్ని (మల్టీ-మోడల్ కనెక్టివిటీ), రవాణా సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తారు. ఈ ప్రాజెక్టులను పీఎం-గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక ఆధారంగా రూపొందించారు. ప్రజలు, వస్తువులు, సేవల రవాణాలో ఈ ప్రాజెక్టులు నిరంతర అనుసంధానం కల్పిస్తాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా నిర్మితం కానున్న ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయితే, భారతీయ రైల్వే ప్రస్తుత నెట్‌వర్క్ సుమారు 901 కిలోమీటర్ల మేర విస్తరిస్తుంది. అలాగే, ప్రతిపాదిత మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్ట్ వల్ల దాదాపు 83 లక్షల జనాభాగల 4,161 గ్రామాలకు అనుసంధానం ఇనుమడిస్తుంది.

ప్రతిపాదిత సామర్థ్యం పెంపుదలతో దేశంలోని మహాకాళేశ్వర్, రణథంబోర్ జాతీయ ఉద్యానం, కునో జాతీయ ఉద్యానం, కియోలాడియో జాతీయ ఉద్యానం, మధుర, బృందావన్, మంత్రాలయం (శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం), శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం (కాసాపురం), శ్యామ్‌నాథ్ ఆలయం, నైమిశారణ్యం (నీమ్సర్) తదితర ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలకు రైల్వే అనుసంధానం మెరుగవుతుంది.

అంతేకాకుండా బొగ్గు, ఆహార ధాన్యాలు, సిమెంట్, పెట్రోలియం, ఉక్కు-ఇనుము, ఇనుప ఖనిజం కంటైనర్లు, ఎరువులు వంటి వస్తువుల రవాణాకు ప్రతిపాదిత ప్రాజెక్టులు కీలక మార్గాలు. ఈ రైలు మార్గాల సామర్థ్యం పెంపుతో ఏటా 60 మిలియన్ టన్నుల సరకు అదనంగా రవాణా అవుతుంది. రైల్వేలు పర్యావరణ హితం, ఇంధన పొదుపు సామర్థ్యం గల రవాణా సాధనం. కాబట్టి, వాతావరణ లక్ష్యాల సాధన, జాతీయ రవాణా వ్యయం తగ్గించడంలో కూడా తోడ్పడతాయి. అంతేగాక చమురు దిగుమతిని (37 కోట్ల లీటర్ల మేర), కర్బన ఉద్గారాలను (185 కోట్ల కిలోలదాకా) తగ్గిస్తాయి... అంటే- 7 కోట్ల మొక్కలు నాటడంతో సమానం అన్నమాట!

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు ప్రశంసనీయం

అమరావతి, మే 7: శాంతిభద్రతల పరిరక్షణ అంటే కేవలం నేరాలను అరికట్టడం మాత్రమే కాదు? ప్రజల్లో భద్రతా భావన కలిగించడం, ఒక నమ్మకాన్ని నెలకొల్పడం కూడా. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నారు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, జిల్లా పోలీసు యంత్రాంగం. డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది తీసుకుంటున్న చర్యలు ప్రస్తుతం ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన నాయకత్వం ఎస్పీ సతీష్ కుమార్‌దే అని చెప్పాలి. కేసుల పరిష్కారంలో వేగం, నేరాలపై కఠిన వైఖరి, ప్రజలతో సాన్నిహిత్యం ఈ మూడు అంశాలు ఆయన పనితీరును ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

సాధారణంగా పోలీసుల పని తీరులో లోపాలు కనిపిస్తే విమర్శించడం సహజం. అయితే అదే విధంగా వారు సమర్థవంతంగా పనిచేసినప్పుడు అభినందించడం కూడా సమాజ బాధ్యతే. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న పలు ఘటనలను పోలీసులు వేగంగా ఛేదించిన తీరు ఇందుకు నిదర్శనం. హిందూపురంలో 63 ఏళ్ల రాజేశ్వరమ్మపై జరిగిన రాబరీ కేసును కేవలం 10 గంటల్లోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడం పోలీసుల అప్రమత్తతకు అద్దం పట్టింది.

అలాగే నేషనల్ హైవే-44 పై సంచలనం సృష్టించిన హవాలా డబ్బు దోపిడీ కేసును సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, సీడీఆర్ ఐపీడీఆర్ విశ్లేషణల సహాయంతో ఛేదించి అంతర్‌రాష్ట్ర నేర ముఠాను అరెస్ట్ చేయడం పోలీసుల దర్యాప్తు నైపుణ్యాన్ని చాటిచెప్పింది. కదిరి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేపట్టిన చర్యలు కూడా ప్రజలకు భరోసానిచ్చాయి. రౌడీ షీటర్ల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, వారికి, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా పోలీసులు కేవలం శిక్ష విధించే వ్యవస్థ మాత్రమే కాకుండా మార్పుకు మార్గనిర్దేశం చేసే వ్యవస్థగా నిలుస్తున్నారు.

చిలమత్తూరులో గుప్తనిధుల కోసం ప్రమాదకర తవ్వకాలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం, కదిరిలో జరిగిన చైన్‌స్నాచింగ్ కేసును సీసీ కెమెరాల సహాయంతో వేగంగా ఛేదించడం వంటి ఘటనలు పోలీసుల స్పందనశీలతను స్పష్టం చేస్తున్నాయి. దీంతో ప్రజల్లో పోలీసింగ్‌పై విశ్వాసం మరింత బలపడుతోంది. టెక్నాలజీ వినియోగంలో కూడా జిల్లా పోలీసులు ముందంజలో ఉన్నారు. జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ నిఘా, పెట్రోలింగ్ వాహనాల పెంపు వంటి చర్యలు నేరాలను ముందుగానే అరికట్టే దిశగా ఉపయోగపడుతున్నాయి.

వీటి అమలులో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయడం, సమన్వయంతో ముందుకు సాగడం మంచి పరిణామం. అలాగే పోలీసు బదిలీలలో పారదర్శకత, ప్రజాప్రతినిధులతో సమన్వయం వంటి అంశాలు పాలనపై విశ్వసనీయతను పెంచుతున్నాయి. అయితే ప్రజల తరఫున కొన్ని చిన్న చిన్న సూచనలు కూడా ఉన్నాయి. మైనర్ పిల్లల డ్రైవింగ్, రోడ్లపై ప్రమాదకర విన్యాసాలు చేసే యువతను నియంత్రిస్తే మరింత భద్రత కలుగుతుంది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ప్రశాంతంగా సంచరించగలుగుతారు. రాత్రి గస్తీ మరింత పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. పోలీసులు కేవలం చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ మాత్రమే కాదు.. సమాజాన్ని సురక్షితంగా, శాంతియుతంగా మార్చే శక్తి అని శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు నిరూపిస్తున్నారు. ప్రజల సహకారం, పోలీసుల కృషి ఈ రెండూ కలిసినప్పుడే భద్రత ఒక లక్ష్యం కాదు, ఒక జీవన విధానంగా మారుతుంది. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ చూపిస్తున్న చొరవ, కేసుల సత్వర పరిష్కారంలో ప్రదర్శిస్తున్న సమర్థత నిజంగా అభినందనీయం.

# గుజరాత్‌లోని వడినార్ వద్ద నౌకల మరమ్మత్తు కేంద్రానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, మే 7:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ క్యాబినెట్ కమిటీ గుజరాత్‌లోని వడినార్‌లో ఆధునిక సాంకేతికతతో కూడిన నౌకల మరమ్మత్తు కేంద్రం అభివృద్ధికి ఆమోదం తెలిపింది. ఇది దేశంలో నౌకల మరమ్మత్తు వ్యవస్థను విస్తరించడంలో కీలక ముందడుగుగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్టును దీన్ దయాళ్ పోర్టు అథారిటీ (డీపీఏ), కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) రూ.1,570 కోట్ల ఉమ్మడి పెట్టుబడితో సంయుక్తంగా అమలు చేస్తాయి.

ఈ ప్రాజెక్టును బ్రౌన్‌ఫీల్డ్ సదుపాయంగా ప్రణాళిక చేశారు. ఇందులో 650 మీటర్ల జెట్టి, రెండు పెద్ద ఫ్లోటింగ్ డ్రై డాక్స్, వర్క్‌షాప్‌లు, సముద్ర సంబంధిత మౌలిక సదుపాయాలు ఉంటాయి. వడినార్‌కు సహజంగా ఉన్న లోతైన నీటి సౌకర్యం, ప్రధాన నౌకాయాన మార్గాలతో ఉన్న అనుసంధానం, అలాగే ముంద్రా, కాండ్లా వంటి కీలక పోర్టులకు సమీపంగా ఉండటం వల్ల, ముఖ్యంగా పెద్ద వాణిజ్య నౌకలు, విదేశీ నౌకల మరమ్మతు కార్యకలాపాలకు ఇది అనుకూలమైన ప్రదేశంగా నిలుస్తుంది.

ఈ ప్రాజెక్ట్ నైపుణ్యాభివృద్ధికి అవకాశాలను సృష్టిస్తుంది. ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పిస్తుంది. అలాగే, పరిసర ప్రాంతాల్లో సముద్ర అనుబంధ సేవలు, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి దోహదం చేస్తుంది.

వడినార్ నౌకల మరమ్మత్తు కేంద్రం భారత నౌకాయాన మౌలిక సదుపాయాల్లోని ప్రధాన లోపాన్ని నేరుగా సరిచేస్తుంది. ప్రస్తుతం మన దేశంలో 230 మీటర్ల పైగా పొడవున్న పెద్ద నౌకలను మరమ్మత్తు చేయడానికి తగినంత సామర్థ్యం లేదు. 300 మీటర్ల వరకు పొడవున్న నౌకల మరమ్మత్తులకు ఈ కేంద్రం వీలు కల్పిస్తుంది. దీనివల్ల పెద్ద నౌకలకు చేసే ఖరీదైన మరమ్మతులు భారతదేశంలోనే జరుగుతాయి. ఇది విదేశీ నౌకాశ్రయాలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తుంది.

పశ్చిమ తీరంలో నౌకల రాకపోకల సమయం తగ్గడం, మరమ్మత్తు సామర్థ్యం పెరగడం వల్ల భారతీయ ఓడరేవుల పోటీతత్వం మెరుగుపడుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా నౌకల మరమ్మత్తు, రవాణా, అనుబంధ పరిశ్రమల్లో సుమారు 290 ప్రత్యక్ష, 1,100 పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయి. ఇది సముద్రయాన పారిశ్రామిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది.

ఈ ప్రాజెక్టు ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తోడ్పడటమే కాకుండా 'మారిటైమ్ ఇండియా విజన్ 2030', 'మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047' కింద భారత సుదీర్ఘకాల నౌకాయాన లక్ష్యాలకు మద్దతునిస్తుంది.

# జీజీహెచ్‌లో డైట్ విభాగంపై ఆకస్మిక తనిఖీ

## -ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సూపరింటెండెంట్ ప్రత్యేక దృష్టి.



కర్నూలు, మే 7: కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది.

ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు గురువారం ఆసుపత్రిలోని డైట్ విభాగం (వంటశాల)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలలో ఆహారం తయారీ విధానం, నిల్వ వ్యవస్థ, పరిశుభ్రత ప్రమాణాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యతను అంచనా వేసేందుకు స్వయంగా వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం వార్డుల్లో రోగుల సహాయకులతో మాట్లాడిన సూపరింటెండెంట్, భోజనం సమయానికి అందుతున్నదా, రుచిగా ఉందా, నాణ్యత ఎలా ఉందని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, డైట్ విభాగం సిబ్బంది పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రతి రోగికి నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందేలా చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఆర్ఎంఓ డాక్టర్ వెంకట రమణ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి ఆశయాలు యువతకు స్ఫూర్తి

## -చిత్తూరు డి ఆర్ ఓ మోహన్ కుమార్

## -జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహణ



చిత్తూరు, మే 7: భారతదేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో అజరామరమైన స్థానాన్ని సంపాదించుకున్న విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీక అని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ కొనియాడారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించి గిరిజన ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన అల్లూరి సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. గురువారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోని వివేకానంద భవన ఆవరణలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి మహనీయుడి త్యాగాలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాటం ఒక ప్రత్యేక అధ్యాయమని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి పోరాడిన అల్లూరి నిజమైన దేశభక్తుడని కొనియాడారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం అప్పటి యువతలోనే కాకుండా నేటి తరానికి కూడా ప్రేరణగా నిలుస్తోందన్నారు. స్వాతంత్ర్యం కోసం అల్లూరి చేపట్టిన సాయుధ పోరాటం దేశ చరిత్రలో మహోన్నత ఘట్టమని పేర్కొన్నారు. అన్యాయానికి ఎదురు నిలబడే ధైర్యం, దేశం కోసం త్యాగం చేసే తపన ప్రతి యువకుడు అలవర్చుకోవాలని సూచించారు. దేశభక్తి, సేవాభావం, నిబద్ధత వంటి విలువలను అల్లూరి జీవితం మనకు నేర్పుతుందని తెలిపారు.

అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ఎందరో స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తినిచ్చిందని, ఆయన త్యాగాలను తరతరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వాతంత్ర్యం సాధనలో గిరిజన ప్రాంతాల పాత్ర ఎంతో కీలకమైందని, ఆ ప్రాంత ప్రజలను చైతన్యపరిచిన మహానేత అల్లూరి అని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను యువత ఆచరణలో పెట్టాలని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారులు నరేంద్ర కుమార్, గౌరీ, సీపీఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫైల్స్ కాదు- ఫలితాలు కదలాలి

## -క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే సుపరిపాలన సాధ్యం
## -కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశ

కర్నూలు, మే 7: "ఆఫీస్ డేటా చెబుతుంది- కానీ ఫీల్డ్ నిజాన్ని చూపిస్తుంది. అధికారులు




క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ఫలితాల ఆధారిత పాలన అందించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయంలో కొనసాగుతున్న 7వ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న సీఎం, రాష్ట్ర పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. "ఫైల్స్ కదలడం కాదు.. ఫలితాలు కదలాలి. గవర్నెన్స్ వేగమే అభివృద్ధి వేగాన్ని నిర్ణయిస్తుంది" అంటూ అధికార వ్యవస్థ ప్రజలకు ప్రత్యక్ష ఫలితాలు అందించేలా పనిచేయాలని సీఎం సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో రాజీ లేదు ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు వందశాతం పరిష్కారం కావాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.

ముఖ్యంగా ఆర్థికేతర ఫిర్యాదులను అధికారులు పైకి కిందకు తిప్పకుండా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థిక సంబంధిత ఫిర్యాదుల విషయంలో కూడా సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. 2027 మార్చి నాటికి రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేసి "జీరో ఎర్రర్ రికార్డులు" రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్యానించారు.

"వెల్ఫేర్ - డెవలప్‌మెంట -వెల్త్ క్రియేషన్" ఒక చక్రం సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి పరస్పర అనుసంధానమై ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. "అభివృద్ధి లేకుండా సంపద లేదు.. సంపద లేకుండా సంక్షేమం సాధ్యం కాదు" అని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు భద్రత, భరోసా కల్పించామని, పీ4 విధానంతో రాష్ట్ర ఆర్థిక ప్రమాణాలను పెంచుతున్నామని వెల్లడించారు. 26 కొత్త పారిశ్రామిక విధానాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌పై విశ్వాసం పెరిగిందన్నారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు 24 లక్షల ఉద్యోగాలు లక్ష్యం రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్ల మేర ఎంఓయూలు కుదిరాయని, అవి అమలైతే దాదాపు 24 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని సీఎం తెలిపారు.

గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పారు. డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారబోతుందని పేర్కొన్నారు. గూగుల్ ఆర్కే లర్ మిటాల్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని వెల్లడించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి గూగుల్ వరకూ? ఏపీపై పెట్టుబడిదారుల దృష్టి "కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ నడపడం గర్వంగా భావించేవాళ్లం. అలాంటి సంస్థను ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చాం" అంటూ పరిశ్రమల అభివృద్ధిపై సీఎం వ్యాఖ్యానించారు.

వేసవిలో దేశ ప్రజలకు చల్లదనం అందించే ఏసీలను కూడా ఇకపై ఏపీ నుంచే సరఫరా చేసే స్థాయికి రాష్ట్రం చేరుకుందని చెప్పారు. ప్రజా సేవలో కొత్త ప్రమాణాలు అధికారులు మూడు రోజుల పాటు ఫీల్డ్‌లో ఉండేలా "సీయింగ్ ఈజ్ బిలీవింగ్" విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. కార్యదర్శులు, హెచ్‌వోడీలు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు. ప్రజల కోసం పనిచేసే అధికారులకు ఎలాంటి భయం అవసరం లేదని, పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యమని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల వినియోగం పెరిగిందని, ప్రజలు ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించే స్థాయికి అవగాహన పెరిగిందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ నుంచి మెగా డీఎస్సీ వరకూ పథకాల అమలుపై వివరాలు కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, విజయాలను సీఎం విపులంగా వివరించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, మత్స్యకార సేవలు, ఆటో డ్రైవర్ల సంక్షేమం, మెగా డీఎస్సీ, ఉచిత ఇసుక విధానం, పాఠశాలల అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా ప్రాజెక్టుల పురోగతి, గ్రీన్ ఎనర్జీ ఒప్పందాలు, ఐటీ, ఏఐ, డేటా సెంటర్ల స్థాపన వంటి అంశాలను ప్రస్తావించారు. ఏపీ దేశానికి బెంచ్‌మార్క్ కావాలి.

అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పనితీరు దేశానికి ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. జిల్లాల మధ్య అభివృద్ధి పోటీ ఉండాలని, ఉత్తమ పద్ధతులను ఇతర జిల్లాల్లో కూడా అమలు చేస్తామని తెలిపారు. "సమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచిస్తేనే సుపరిపాలన సాధ్యమవుతుంది. డబ్బులు లేవని చెప్పడం కాదు సంపద సృష్టించే దిశగా పని చేయాలి" అంటూ సీఎం అధికారులకు పిలుపునిచ్చారు.

# 2026-27 సీజన్ కోసం చెరకు రైతులకు క్వింటాల్‌కు రూ.365 న్యాయమైన, లాభదాయకమైన ధర'కు మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, మే 7:చెరకు రైతుల (గన్నా కిసాన్) ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, 2026-27 చక్కెర సీజన్ (అక్టోబర్ - సెప్టెంబర్) కోసం 10.25 శాతం ప్రాథమిక రికవరీ గల చెరకు పంటకు క్వింటాల్‌కు రూ. 365 'న్యాయమైన, లాభదాయకమైన ధర' (ఎఫ్ఆర్‌పీ)కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 10.25 శాతం కంటే ఎక్కువ రికవరీలో వచ్చే ప్రతి 0.1 శాతం పెరుగుదలకు క్వింటాల్‌కు రూ. 3.56 చొప్పున అదనపు ప్రోత్సాహకాన్ని (ప్రీమియం) అందించాలని, రికవరీలో వచ్చే ప్రతి 0.1 శాతం తగ్గుదలకు ఎఫ్ఆర్‌పీని క్వింటాల్‌కు రూ. 3.56 చొప్పున తొలగించాలని నిర్ణయించారు.

చెరకు రైతుల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశంతో, చక్కెర మిల్లుల్లో చక్కెర దిగుబడి (రికవరీ) 9.5 శాతం కంటే తక్కువగా ఉన్న సందర్భాల్లో ఎటువంటి కోత విధించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే 2026-27 చక్కెర సీజన్‌లో, అటువంటి రైతులకు క్వింటాల్ చెరకు కోసం రూ. 338.3 లభిస్తుంది.

2026-27 చక్కెర సీజన్‌కు సంబంధించి, చెరకు ఉత్పత్తి వ్యయం (ఏ2 + ఎఫ్ఎల్) క్వింటాలుకు రూ. 182 గా ఉంది. 10.25 శాతం రికవరీ రేటు వద్ద క్వింటాలుకు అందిస్తున్న రూ. 365 ఎఫ్ఆర్‌పీ (న్యాయమైన, లాభదాయకమైన ధర)... ఉత్పత్తి వ్యయం కంటే 100.5 శాతం అధికం. 2026-27 చక్కెర సీజన్‌కు సంబంధించిన ఎఫ్ఆర్‌పీ, ప్రస్తుత 2025-26 చక్కెర సీజన్ ఎఫ్ఆర్‌పీ కంటే 2.81 శాతం అధికం.

2026-27 చక్కెర సీజన్‌లో (అక్టోబర్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చేలా), రైతుల నుంచి చెరకును కొనుగోలు చేయడం కోసం చక్కెర మిల్లులు తాజాగా ఆమోదించిన ఎఫ్ఆర్‌పీ (న్యాయమైన మరియు లాభదాయకమైన ధర) చెల్లించాల్సి ఉంటుంది. చక్కెర రంగం ఒక ముఖ్యమైన వ్యవసాయాధారిత రంగం. సుమారు 5 కోట్ల మంది చెరకు రైతులు సహా, వారిపై ఆధారపడిన వారి జీవనోపాధిని, చక్కెర మిల్లుల్లో ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న సుమారు 5 లక్షల మంది కార్మికుల జీవనోపాధిని ఇది ప్రభావితం చేస్తుంది. వ్యవసాయ కూలీలు, రవాణా సహా వివిధ అనుబంధ రంగాల కార్యకలాపాల్లో ఉపాధి పొందుతున్న వారిపై ఈ రంగం ప్రభావం చూపుతుంది.

వ్యవసాయ సంబంధిత వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా... రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర సంబంధిత వర్గాలతో సంప్రదించిన అనంతరం ఈ ఎఫ్ఆర్‌పీని నిర్ణయించారు. గత చక్కెర సీజన్ 2024 -25లో చెల్లించాల్సిన మొత్తం చెరకు బకాయిలు రూ. 1,02,687 కోట్లుగా ఉండగా... 20.04. 2026 నాటికి రైతులకు సుమారు రూ. 1,02,209 కోట్ల బకాయి లను చెల్లించారు. సుమారు 99.5 శాతం వరకు చెరకు బకాయిల చెల్లింపు పూర్తయింది. ప్రస్తుత చక్కెర సీజన్ 2025-26లో చెల్లించాల్సిన మొత్తం చెరకు బకాయిలు రూ. 1,12,740 కోట్లకు గానూ, 20.04. 2026 నాటికి రైతులకు సుమారు రూ. 99,961 కోట్ల బకాయిల చెల్లింపు పూర్తి చేశారు. సుమారు 88.6 శాతం వరకు చెరకు బకాయిల చెల్లింపు పూర్తయింది.

# సంక్షేమ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



నల్గొండ, మే 7:కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు రైతు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారి బి రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూర్ రైతు వేదిక భవనంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలు అవగాహన సదస్సునిర్వహించారు.

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలు సాగు చేయాలని తెలిపారు..

ఏవో బి రాజు మాట్లాడుతూ.. పీఎం కుసుం పథకం కింద వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం సహకారం తో సోలార్ ప్యానల్స్ అమర్చే విధానంపై సోలార్ కనెక్షన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే విధానంపై రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ యశ్వంత్ రెడ్డి ,ఏఈఓలు సౌజన్య సాయిరాం రాజు రైతులు ఫర్టిలైజర్ డీలర్స్ ,తదితరులు పాల్గొన్నారు.

# మక్క బస్తాల రవాణాకు లారీల సదుపాయం కల్పించాలి

## -ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో సీపీఎం నాయకులు, రైతుల ధర్నా
## -10 లారీలు పంపిస్తున్నట్లు ఉన్నతాధికారుల హామీ




ఖమ్మం, మే 7: ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని రైతు వేదికలో ఈ రోజు నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో మక్క రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని, కాంటాలైన మక్క బస్తాలను వెంటనే గోదాంలకు తరలించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం, సీపీఎం నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గన్ని సంచుల కొనుగోలు నుండి మక్కల రవాణా నిమిత్తం లారీలను కూడా రైతులే కిరాయికి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని, ఈ పరిస్థితులకు పరిష్కారమెందుకు చూపడం లేదని వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు.

వాతావరణంలో వస్తున్న మార్పులకు కల్లాలలో ఉన్న మక్కలను కాపాడుకోవడానికి రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నా, కాంటాలు పూర్తయి 20 రోజులు గడుస్తున్నా, మక్క బస్తాలను ఎందుకు తరలించడం లేదని ప్రశ్నించారు. అకాల వర్షాలకు అన్నదాత మళ్లీ మళ్ళీ నష్టపోక ముందే కొనుగోళ్లు పూర్తి చేసి బస్తాలను గోదాములకు తరలించాలని డిమాండ్ చేశారు. బదులుగా ఏడిఏ స్వర్ణ విజయ చంద్ర మాట్లాడుతూ ప్రతి బస్తాను గోదాములలోకి తరలిస్తామని, ఆ విధంగా ప్రణాళికలు చేపడుతున్నామని, రైతులు అధైర్య పడొద్దని చెప్పినప్పటికీ వారు వినలేదు. తక్షణమే లారీల సదుపాయం కల్పించి మక్క బస్తాలను రవాణా చేసే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.

దీంతో ఏడిఏ స్వర్ణ విజయ్ చంద్ర మార్క్ ఫెడ్ డిఎం శ్యామ్ కుమార్ తో ఫోన్లో సంభాషించి సమస్య తీవ్రతను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, కాంటాలైన మక్క బస్తాల రవాణాకు ప్రస్తుతం 10 లారీలను పంపిస్తామని హామీ రావడంతో నాయకులు, రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపిఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బొంతు రాంబాబు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్, దొండపాటి నాగేశ్వరరావు, మాదినేని వీరభద్రరావు, గుగులోతు నరేష్, దొండపాటి సత్యనారాయణ, నల్లమోతు వాణి, రైతులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యాన్ని నడిపిస్తున్న శక్తి అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలే

న్యూఢిల్లీ, మే 7:"మన రక్షణ రంగ ఫ్యాక్టరీల నుంచే భారత దేశ సైనిక శక్తి ఉద్భవిస్తోంది" అని రక్షణ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అత్యాధునిక ఆయుధాలు, ఆయుధ వ్యవస్థల సామర్థ్యంతో బలోపేతమైన రక్షణ బలగాల అసమానమైన ధైర్యం, సంకల్పమే ఆపరేషన్ సిందూర్ విజయానికి కారణమన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న నార్త్ టెక్ సింపోజియంలో 2026 మే 5న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భారత దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే వెన్నెముక అని, అంకుర సంస్థలే దేశానికి బ్రాండ్ అంబాసిడర్లని అన్నారు. "భవిష్యత్తు వృద్ధిని నడిపించేది మన అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలే. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను నెరవేర్చడంలో కీలకపాత్ర పోషించే ఆధునిక విశ్వకర్మలు ఇవి" అని అన్నారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదుల స్థావరాలను నిర్మూలించి, భారత దేశ శత్రువుల కుయుక్తులను భగ్నం చేసిన రక్షణ బలగాలను రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రశంసించారు. రక్షణ రంగంలో ఆత్మ నిర్భరతను సాధించాలనే మొత్తం దేశం - ప్రభుత్వం, డీపీఎస్‌యూలు, ప్రైవేటు రంగం, ముఖ్యంగా ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈల సంకల్పానికి మేడ్ ఇన్ ఇండియా సాధనాల సమర్థ వినియోగమే నిదర్శనవన్నారు.

దేశ ప్రయోజనాలను కాపాడేలా తన సొంత సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాలని విశ్వసించే నవ భారత ఆవిర్భావానికి రికార్డు స్థాయిలో నమోదైన రక్షణ ఉత్పత్తి, రక్షణ ఎగుమతుల గణాంకాలే నిదర్శనమని రక్షణ శాఖ సహాయ మంత్రి స్పష్టం చేశారు. "ఈ నవ భారతం ఎవరికీ చెడు చేయాలని ప్రయత్నించదు. తన సార్వభౌమత్వానికి ముప్పు కలిగించాలని ప్రయత్నించేవారిని విడిచిపెట్టదు" అని చెప్పారు. ఈ రోజు వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం రేపు ఉపయోగించకపోవచ్చని రక్షణ శాఖ సహాయ మంత్రి అన్నారు. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్న ఈ తరుణంలో వినూత్నంగా ఆలోచించి సాంకేతికంగా ముందంజలో ఉండేందుకు కృషి చేయాలని పరిశ్రమలను కోరారు. దేశంలో రక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఆవిష్కరణ నిరంతరాయంగా కొనసాగే ప్రక్రియ అనీ, దీనికి పూర్తి ప్రభుత్వ సహకారం ఉంటుందనీ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని రక్షణ పారిశ్రామిక కారిడార్ తీసుకొచ్చిన గుణాత్మక ప్రభావాన్ని గుర్తించారు. ఈ ప్రగతిని ఉన్నత శిఖరాలకు చేర్చాలని పరిశ్రమను కోరారు.

నూతన రంగాల్లో ప్రస్తుతం కార్యాచరణ అవసరాలను తీర్చడానికి, భారత ఆర్మీని భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా సిద్ధం చేయడానికి రక్షణ బలగాలతో కలసి పనిచేయాలని పరిశ్రమలను జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ (జీవోసీ-ఇన్-సీ), సెంట్రల్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ అనింధ్య సేన్ గుప్త అభ్యర్థించారు. స్వావలంబనే వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి, సాంకేతిక సార్వభౌమత్వానికి, కార్యాచరణ రూపకల్పనకు దారి తీస్తుందన్నారు.

మూడు రోజుల పాటు జరిగే నార్త్ టెక్ సింపోజియం-2026ను భారత ఆర్మీకి చెందిన ఉత్తర, మధ్య సైనిక విభాగాలు, ఎస్ఐడీఎం నిర్వహిస్తున్నాయి. "రక్షణ త్రివేణీ సంగమం- సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ, సైనిక సామర్థ్యాలు కలిసే చోటు" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. దీనిని 2026 మే 4న రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అత్యాధునిక రక్షణ రంగ సాంకేతికతను ప్రదర్శించేందుకు ప్రైవేటు రక్షణ ఉత్పత్తుల తయారీదారులు 284 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మానవ రహిత ఏరియల్ వాహనాలు (యూఏవీలు), డ్రోన్లు, కౌంటర్ యూఏవీలు, అన్ని భూతల వాహనాలు, నిఘా సాధనాలు, ఇతర రక్షణ ఉత్పత్తులను సైతం ఈ కార్యక్రమంలో ప్రదర్శిస్తారు.

జీవోసీ-ఇన్-సీ ఉత్తర కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, 1 కోర్స్ జీవోసీ లెఫ్టినెంట్ జనరల్ వీ హరిహరన్, భారత రక్షణ తయారీదారుల సంఘం (ఎస్ఐడీఎం) అధ్యక్షుడు శ్రీ అరుణ్ టీ రాంచందానీ, పరిశ్రమ దిగ్గజాలు, ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్ కోసం ఎన్ఎఫ్ఎస్‌యూతో ఒప్పందం కుదుర్చుకున్న యూఐడీఏఐ

న్యూఢిల్లీ, మే 7:డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ భద్రత, అధునాతన టెక్నాలజీ పరిశోధన విభాగాల్లో అయిదేళ్ల కాలానికి నిర్మాణాత్మక సహకారాన్ని ఏర్పాటు చేసుకొనేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది.

సహకారానికి ఒక సమగ్ర విధానాన్ని అందించడంతో పాటు భారత దేశ డిజిటల్ గుర్తింపు వ్యవస్థకు ఆధారమైన యూఐడీఏఐ డిజిటల్ మౌలిక సదుపాయాల్లో సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ఈ ఒప్పందం రెండు జాతీయ సంస్థలను ఒక్క చోట చేర్చింది.

యూఐడీఏఐ సీఈవో శ్రీ వివేక్ చంద్ర వర్మ, ఎన్ఎఫ్ఎస్‌యూ గుజరాత్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) ఎస్‌వో జునారే ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ అభిషేక్ కుమార్ సింగ్, రెండు సంస్థలకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరు వ్యూహాత్మక విభాగాలపై ఈ ఒప్పందం దృష్టి సారిస్తుంది. అవి విద్య-వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి, సమాచార భద్రత-వ్యవస్థ సమగ్రత, ఫోరెన్సిక్ మౌలిక వసతులు-ప్రయోగశాల సామర్థ్యం, సైబర్ భద్రత కార్యకలాపాలకు సాంకేతిక తోడ్పాటు, సాంకేతిక ఏఐ, బ్లాక్ చెయిన్, డీప్ ఫేక్ గుర్తింపు, క్రిప్టోగ్రాఫిక్ టెక్నాలజీ తదితర ఆధునిక రంగాల్లో సాంకేతిక నవాచనలు-పరిశోధన, ఎన్ఎఫ్ఎస్‌యూ విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర అవకాశాలతో సహా వ్యూహాత్మక మార్గదర్శకత్వం.

"భారత దేశ డిజిటల్ మౌలిక వసతులకు తోడ్పాటును అందించడంలో, భారత డిజిటల్ గుర్తింపు వ్యవస్థలను పరిరక్షించడంలో భద్రతను, స్థిరత్వాన్ని, ఫోరెన్సిక్ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా దీనిని భావించవచ్చు" అని యూఐడీఏఐ సీఈవో శ్రీ వివేక్ చంద్ర వర్మ అన్నారు.

# ఆరోగ్య సహకారాన్ని బలోపేతం చేసుకున్న భారత్, జపాన్

న్యూఢిల్లీ, మే 7:ఆరోగ్య రక్షణపై భారత్, జపాన్ మూడో సంయుక్త కమిటీ సమావేశాన్ని భారత్ మండపంలో ఈ రోజు నిర్వహించారు. భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా, జపాన్ ఆరోగ్య రక్షణ విధాన ఇన్‌చార్జి మంత్రి కిమి ఒనోడా ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ జపాన్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. పరస్పర గౌరవం, నమ్మకం, భవిష్యత్తుపై ఉమ్మడి దృక్పథం భారత్, జపాన్ భాగస్వామ్యానికి ప్రాతిపదికలని ఆమె అన్నారు. భారత్ - జపాన్ సహకార ఒప్పందం కింద జరిగిన ఈ సంయుక్త కమిటీ సమావేశం.. నిరంతర చర్చలు, బలమైన పరస్పర అవగాహనలతో ద్వైపాక్షిక సంబంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ముఖ్య వేదికగా నిలిచిందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జరిగే చర్చలు నిర్మాణాత్మకంగా, భవిష్యత్ ఆశాజనకంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శ్రీ నడ్డా మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడానికి, సరికొత్త భాగస్వామ్యాలను ప్రోత్సహించడానికి ఇరు దేశాలకు ఉన్న ఉమ్మడి అంకితభావాన్ని ఈ సమావేశం ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. ఆరోగ్యం, సంక్షేమంపై సహకార ఒప్పందం ఆధారంగా భారత్ - జపాన్ మధ్య ఆరోగ్య రక్షణ సహకారం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, వైద్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడం, మెరుగైన ఆరోగ్య ఫలితాల దిశగా ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఇరు దేశాల ఉమ్మడి లక్ష్యాలు ఈ సహకారానికి ప్రాతిపదికలని స్పష్టం చేశారు. శతాబ్ద కాలానికి పైగా వివిధ రంగాల్లో కొనసాగుతున్న సంబంధాల వల్ల భారత్, జపాన్ మధ్య బహుముఖీనమైన, సుదీర్ఘమైన అనుబంధం ఏర్పడిందని శ్రీ నడ్డా వివరించారు. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' మార్గదర్శక సూత్రంగా సమ్మిళిత అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఆరోగ్య రక్షణ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ సంయుక్త కమిటీ సమావేశం ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, పరిశోధనల ద్వారా ఆరోగ్య రంగ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో జపాన్ ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటుందని ఆ దేశ మంత్రి ఒనోడా పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తమ దేశం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. పెరుగుతున్న వ్యాధుల తీవ్రతను, ముఖ్యంగా అసాంక్రమిక వ్యాధుల ఉధృతి పెరుగుతుండడాన్ని భారత్ బృందం వివరించింది. వీటిని అరికట్టడానికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నిరంతర సంరక్షణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా నిరంతర ఆరోగ్య రక్షణ కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను వారు వివరించారు. మరోవైపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ముందస్తు వ్యాధి గుర్తింపు, సాంకేతిక సహకారం - సంస్థాగత సామర్థ్యాభివృద్ధి ద్వారా చికిత్స వ్యవస్థలను బలోపేతం చేసే ప్రాజెక్టులు సహా.. జపాన్ సహకారంతో చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలను ఆ దేశ ప్రతినిధులు వెల్లడించారు.

# రుణాల మంజూరులో 2025-26 ఆర్థిక సంవత్సరం 15.9 శాతం స్థాయిలో పటిష్ఠ వృద్ధిని నమోదు చేసిన షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు (ఎస్‌సీబీలు)..

న్యూఢిల్లీ, మే 7:ఆహారేతర రుణాల్లో వృద్ధి 2025-26 ఆర్థిక సంవత్సరంలో అంతకు ముందటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, 15.9 × శాతంగా నమోదైంది. ఇది అంతకు ముందటి ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం కనబరచిన 10.9 శాతం కన్నా 497 బేసిస్ పాయింట్ల పెరుగుదలతో పటిష్ఠ స్థాయిని సూచించింది. మొత్తం రుణాలు 2025 మార్చితో ముగిసిన సంవత్సరంలో కన్నా రూ.29.2 లక్షల కోట్లు అధికంగా.. రూ.212.9 లక్షల కోట్లకు ఎగబాకాయి.

వడ్డీ రేటు తక్కువగా ఉండటం, మూలధన వ్యయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం, ఈ పరిణామాలకు అదనంగా తరచుగా విధాన సంస్కరణలను తీసుకు వస్తుండడం, ప్రయివేటు పెట్టుబడుల అవకాశాలు ఇగుర్చుకుపోవడం, దేశీయంగా పరపతి అవసరాలు పెరగడంతో ఇటు వ్యక్తిగత రుణ గ్రహీతల్లోనూ, అటు కంపెనీల్లోనూ నమ్మకాన్ని కలిగించాయి.

సేవల రంగం, వ్యక్తిగత రుణ విభాగం, వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలతో పాటు పరిశ్రమలు.. ఇలా పలు రంగాలు రుణాలు తీసుకోవడానికి ఉత్సాహంగా ముందుకు రావడంతో, 2025-26 ఆర్థిక సంవత్సరంలో పరపతి వృద్ధి అనేక రంగాలకు విస్తరించింది.

వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు: ఈ రంగంలో రుణ వృద్ధి 15.7 శాతం ఉంది. ఇది అంతకు ముందటి సంవత్సరంలో నమోదైన 10.4 శాతం వృద్ధి కన్నా 528 బేసిస్ పాయింట్లు (బీపీఎస్) అధికం. అంతేకాక ఇది వ్యవసాయ రంగానికి దక్కుతున్న బలమైన తోడ్పాటును కూడా సూచిస్తోంది. గ్రామీణ డిమాండు నిరంతరంగా ఉండడం, గ్రామీణ రుణాలను వ్యవస్థీకరించడం వల్ల 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రాథమిక రంగానికి మంజూరు చేసిన రుణాల్లో సకారాత్మక వేగం చోటు చేసుకుంది.

పారిశ్రామిక రంగం: ఈ రంగంలో రుణ మంజూరు వెనుకటి సంవత్సరంలోని 8.2 శాతం కన్న దాదాపు రెండు రెట్లు అధికంగా 15 శాతానికి చేరుకుంది. 33.1 శాతం వార్షిక వృద్ధితో పాటు, సూక్ష్మ లఘు పరిశ్రమలు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3.7 రెట్లు అధిక రుణ వృద్ధిని నమోదు చేశాయి. మధ్యతరహా పరిశ్రమల్లో కూడా ఇదే విధంగా సకారాత్మక ధోరణులు కనిపించాయి. వాటి రుణాల్లో వార్షిక ప్రాతిపదికన 21.7 శాతం వృద్ధి ఉంది. పారిశ్రామిక రుణ విభాగానికి ప్రధాన చోదకాలుగా మౌలిక సదుపాయాల కల్పన, మూల లోహాలు, లోహ ఉత్పాదనలు, రసాయనాలు, రసాయనిక ఉత్పాదనలు, పెట్రోలియమ్, బొగ్గు ఉత్పాదనలతో పాటు పరమాణు ఇంధనాలు వంటివి ఉన్నాయి.

సేవల రంగం: మొత్తం రుణాల్లో 28 శాతం ఈ రంగానిదే. ఇంతకు ముందటి సంవత్సరం ఇదే కాలంలో నమోదైన 12.0 శాతం వృద్ధితో పోలిస్తే 19.0 శాతం స్థాయిలో బలమైన వృద్ధి ఉంది. దీనికి ప్రధానంగా బ్యాంకింగేతర ఆర్థిక సహాయ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ), వ్యాపార రంగం, వాణిజ్య స్థిరాస్తి రంగాల్లో అధిక డిమాండు రావడమే కారణమైంది.

వ్యక్తిగత రుణ విభాగం: మొత్తం రుణాల్లో 33 శాతం వాటా ఈ విభాగానిదే. దీనిలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 16.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది అంతకు ఒక సంవత్సరం కిందట నమోదైన రుణ వృద్ధి (11.7 శాతం) కన్న 455 బేసిస్ పాయింట్లు ఎక్కువ. గృహనిర్మాణ విభాగంలో వృద్ధి నిలకడగా ఉంది. వాహన రుణాలు, బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకుని బదులుగా ఇచ్చే రుణాలు మంచి జోరుమీదున్నాయి.పటిష్ఠంగా ఉన్న రుణ వృద్ధి తీరు దేశంలో ఆర్థిక వాతావరణం సుదృఢంగా ఉందని తెలియజేస్తోంది. మరి మన దేశ ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల్లో రుణాల కోసం డిమాండు అంతకంతకు పెరుగుతోందని సూచిస్తోంది. రుణాల మంజూరులో వృద్ధి బలంగా ఉన్న కారణంగా, కంపెనీలు వ్యాపారాల విస్తరణకు, వ్యక్తులు మన్నికైన వస్తువుల కొనుగోలుకు రుణాలు తీసుకుంటున్నారు. దీంతో స్థిరాస్తుల్లో పెట్టుబడి ద్వారా అదనపు రుణాల అవకాశాలు, తదనుగుణంగా ఉద్యోగావకాశాలు ఏర్పడుతూ.. పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతం లభిస్తోంది.

భౌగోళిక, ఆర్థిక మార్పులతో పాటు భౌగోళిక, రాజకీయ ఒత్తిడులతో ప్రపంచ దేశాల్లో సవాళ్లతో కూడిన నేపథ్యం ఏర్పడినా కూడా, భారత ఆర్థిక వ్యవస్థ అసాధారణ ధీరత్వాన్ని కనబరిచింది. ప్రపంచంలో ఇతర దేశాలన్నిటిలోకీ వేగంగా ముందుకు పోతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది.

దేశ బ్యాంకింగ్ రంగం మన ఆర్థిక అభివృద్ధికి ఒక ప్రధాన చోదకశక్తిగా ఉంది. ఇది ప్రస్తుతం అత్యుత్తమ స్థితిలో ఉంది. దీని బ్యాలెన్స్ షీటు సుదృఢంగా ఉంది. ఆస్తుల విలువ చరిత్రాత్మకంగా తక్కువగాను, లాభదాయకత స్థిరంగాను కొనసాగుతోంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందగలదన్న అంచనాలు పెరుగుతాయి. రుణ మంజూరులో సరళతర మార్పుచేర్పులను ప్రవేశపెడుతుండడంతో పాటు లాంఛన ప్రాయంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం నిరంతర ప్రాతిపదికన ప్రయత్నాలు చేస్తున్న కారణంగా ఆర్థిక వ్యవస్థలో రుణాల మంజూరు విస్తృతమైంది. (ఏటికేడాది వృద్ధి (వై-ఓ-వై గ్రోత్) గణనను, 2025 ఏప్రిల్ 4 నాటికి మంజూరు చేసిన రుణాలతో పోలిస్తే 2026 మార్చి 31 నాటికి ఏ స్థాయిలో రుణాలను అందించారన్న అంశం ఆధారంగా పూర్తి చేశారు. 2025 డిసెంబరు 31 నుంచి, బ్యాంకింగ్ సూత్రాల (సవరణ) చట్టం-2025 ప్రకారం చివరి రిపోర్టింగు పక్షం నిర్వచనాన్ని నెలలోని చివరి దినానికి మార్చారు. దీనికి అనుగుణంగా, 2025 డిసెంబరు కన్నా తరువాతి వార్షిక వృద్ధి రేట్లు వర్తమాన సంవత్సరం నెలాఖరు గణాంకాలతో పాటు అంతకు ముందటి సంవత్సరంలోని సంబంధిత నెల చివరి రిపోర్టింగ్ పక్షం (పాత నిర్వచనం ప్రకారం) గణాంకాలపై ఆధారపడి ఉన్నాయి.

# హిందీ పాత్రికేయ ప్రస్థానం ద్విశతాబ్ది సందర్భంగా 'సంచార్ మాధ్యం' ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన 'ఐఐఎంసీ'

న్యూఢిల్లీ, మే 7:దేశంలో హిందీ పాత్రికేయ ప్రస్థానానికి 200 ఏళ్లు నిండిన నేపథ్యంలో ఈ రోజు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్' (ఐఐఎంసీ) ప్రధాన పరిశోధనాత్మక పత్రిక 'సంచార్ మాధ్యం' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సందర్భంగా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ శ్రీ హరివంశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంసీ వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రజ్ఞా పలీవాల్ గౌర్, సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీ కె.కె.నిరాలా కూడా పాల్గొన్నారు.

భారత్ ప్రగతి ప్రస్థానంలో హిందీ పాత్రికేయానికిగల సుసంపన్న వారసత్వాన్ని, దాని పరిణామశీల పాత్రను ఈ సందర్భంగా హరివంశ్ వివరించారు. కాలానుగుణంగా మార్పు వేగం పుంజుకుంటున్న నేటి శకంలో 'అక్షరాస్యులు-నిరక్షరాస్యులు' అనే పదాలకు నిర్వచనం చదవడం-రాయడమనే సంప్రదాయ పరిధులను అధిగమించిందని అన్నారు. నిరంతర అభ్యసనం, అభివృద్ధి చెందుతున్న జ్ఞాన వ్యవస్థలకు అనుగుణంగా మారే సామర్థ్యం అత్యంత అవశ్యమైంది. మార్పు రావాలంటే ఒకప్పుడు శతాబ్దాలు పట్టిన నేపథ్యంలో నేటి సాంకేతికతలు సంవత్సరాలు, నెలల వ్యవధిలోనే రూపాంతరం చెందుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఇటువంటి పరిస్థితుల నడుమ అర్థవంతమైన కలలు కనడంతోపాటు వాటి సాకారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన ప్రతి ఒక్కరినీ... ముఖ్యంగా యువతరాన్ని కోరారు. "అకుంఠిత దీక్షతో శ్రమిస్తేనే 1826లో కలకత్తా నుంచి ప్రచురితమైన తొలి హిందీ వార్తాపత్రిక 'ఉదంత మార్తాండ్' తరహాలో కాలంపై తమదైన శాశ్వత ముద్ర వేయగలర"ని ఆయన స్పష్టం చేశారు.

'వికసిత భారత్-2047' దృక్కోణాన్ని ప్రస్తావిస్తూ- దేశ భవిష్యత్తు రూపకల్పనలో సమాచార-ప్రసార, పరిశోధన-ఆవిష్కరణల కీలక పాత్రను శ్రీ హరివంశ్ ప్రముఖంగా వివరించారు. ప్రస్తుత కాలాన్ని "నైపుణ్యాధారిత యుగం"గా ఆయన అభివర్ణించారు. నేటి పరిస్థితులలో నైపుణ్య సముపార్జన, సద్వినియోగం జీవితాలనే మార్చేస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక రూపాంతరీకరణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ- అది తరచూ విస్తృత సామాజిక పరిణామాలకు మార్గనిర్దేశం చేస్తుందని వ్యాఖ్యానించారు. హై-స్పీడ్ రైలు, ఆధునిక ఓడరేవులు, ఇతర కీలక రంగాలు సహా మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ సాధించిన ఇటీవలి ప్రగతిని ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు.

నేటి సమాచార విప్లవ శకంలో వ్యష్టి-సమష్టి భవిష్యత్తును తీర్చిదిద్దగల వినూత్న ఆవిష్కరణలతో సంప్రదాయ మార్గాలను మించి ముందడుగు వేయగల సాహసం అవసరమని పేర్కొన్నారు. అత్యంత సూక్ష్మ సమాచారం కూడా ప్రజలకు చేరేలా చూడటం పాత్రికేయ లక్ష్యం కావాకలని, తద్వారా జాతీయ ప్రాముఖ్యంగల అంశాలపై సమాచార సహిత బహిరంగ చర్చకు, ఏకాభిప్రాయానికి వీలు కల్పించాలని శ్రీ హరివంశ్ స్పష్టం చేశారు. సమాచార ప్రసారకర్తలు దేశ శ్రేయస్సుపై తమ బాధ్యతను పూర్తిస్థాయిలో గుర్తించాలని ఆయన సూచించారు.

ఐఐఎంసీ వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రజ్ఞా పలీవాల్ గౌర్ మాట్లాడుతూ- గడచిన రెండు శతాబ్దాల హిందీ పాత్రికేయం పరిణామంలో కీలక ఘట్టాలను 'సంచార్ మాధ్యం' ప్రత్యేక సంచిక ప్రతిబింబిస్తున్నదని చెప్పారు. ప్రముఖ విద్యావేత్తలు, మీడియా నిపుణుల రచనలను ఇది గుదిగుచ్చి అందించిందని పేర్కొన్నారు. పత్రికారంగంలో నేటి పోకడలను ఈ ప్రతిక నిరంతరం నిశితంగా గమనిస్తూనే, సుసంపన్న భారతీయ జ్ఞాన సంప్రదాయాంశాలను సమకాలీన చట్రం కోణం నుంచి పునఃపరిశీలించడంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

# జనగణన-2027పై అవగాహన సదస్సు..

## -ఎల్లంపేటలో మున్సిపల్ లో ఘనంగా 2కే రన్ ప్రారంభం..




మేడ్చల్,మే 7: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో 'స్వీయ గణన' (రావశ్రీట ఇనిబీఎవతీజీబితినీని) ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఉదయం 2కే మారథాన్ రన్ నిర్వహించారు. ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి,చైర్‌పర్సన్ లావుడియా శ్రీదేవి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ స్థానిక వివేకానంద విగ్రహం నుండి ప్రారంభమై ఎల్లంపేట బస్టాప్ వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు తమ వివరాలను తామే నమోదు చేసుకునే ఈ 'స్వీయ గణన' విధానంపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా పారదర్శకమైన గణాంకాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల మహిళలు, యువజన సంఘాల సభ్యులు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జనగణనతోనే ప్రజా సంక్షేమం అనే లక్ష్యంతో ఈ అవగాహన ర్యాలీ సాగింది. మున్సిపల్ యంత్రాంగం చేపట్టిన ఈ వినూత్న అవగాహన కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం

న్యూఢిల్లీ, మే 7: దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ స్వల్ప నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలు కొనసాగించడం వంటి అంశాలు మార్కెట్లపై ప్రభావం చూపించాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు.

నేటి ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 78,339 పాయింట్ల వద్ద ప్రారంభమై ఒక దశలో 78,384 గరిష్ఠానికి చేరగా.. మరో దశలో 77,713 కనిష్ఠాన్ని తాకింది. చివరకు 114 పాయింట్లు కోల్పోయి 77,844 వద్ద ముగిసింది. నిఫ్టీ స్వల్ప మార్పులతో 24,326 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 25 పైసలు బలపడి 94.24 వద్ద నమోదైంది.

నిఫ్టీ సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఆటో, ఎంఅండ్ఎం, గ్రాసిమ్, ఎన్టీపీసీ షేర్లు లాభాల్లో నిలిచాయి. ఇక హెచ్‌యూఎల్, టీసీఎస్, టెక్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, ఐటీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి.

# టీటీడీకి రూ.20 లక్షలు విరాళం .. తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ



తిరుపతి, మే 7: తిరుమల లో వేంకటేశ్వర స్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ ట్రస్టులకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన నవ్య మార్కెటింగ్ సంస్థ గురువారం టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10,01,116 విరాళంగా అందించింది.ఉ వనీణతీజీజూష్ట్రతిఇ ఖీవటవతీవనిఇవ

గుంటూరుకు చెందిన వెంకట కృష్ణ చైతన్య వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాతల తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న 71,029 మంది భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకోగా 31,184 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.07 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వివరించారు. సర్వదర్శనానికి 6 గంటల సమయం పడుతుందని వివరించారు.

# బోయ జంగయ్య సాహిత్య సేవలు మరువలేనివి



నల్గొండ, మే 7: సాహిత్య రంగానికి బోయ జంగయ్య చేసిన సేవలు మరువలేనివి పలువురు కవులు, రచయితలు అన్నారు. తెలంగాణ సాహితీ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ తెలంగాణ కవి, రచయిత డాక్టర్ బోయ జంగయ్య వర్ధంతి సభ గురువారం ఉదయం నల్లగొండలోని యుటీఎఫ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బోయ జంగయ్య చిత్రపటానికి నల్లగొండ జిల్లా కవులు, రచయితలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ సాహితీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. బోయ జంగయ్య మారూముల గ్రామంలో అతి నిరుపేద కుటుంబంలో జన్మించి దళితుడిగా వివక్షను ఎదుర్కొని ఎంతో కష్టపడి చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడన్నారు.

అంతేకాకుండా ఒక రచయితగా సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను తన రచనల ద్వారా తొలగించడానికి ప్రయత్నం చేసిన సంఘ సంస్కర్తని, కవిగా, రచయితగా, నాటక రచయితగా, బాల సాహితీవేత్తగా బహుముఖీన ప్రతిభను రచనారంగంలో ప్రదర్శించి తనదైన స్థానాన్ని తెలుగు సాహిత్యంలో సంపాదించారన్నారు. ఆయన రాసిన జగడం నవల రజాకార్ల దురాగతాలను దేశ్ ముఖుల పెత్తందార్ల దౌర్జన్యాలను ఎండ కట్టారని, ఆయన రచనలలో మట్టి వాసనలు గ్రామీణ జీవితాలు ప్రతిబింబించేవని, ఆయన రచనలను ఎనిమిదవ తరగతి పాఠ్య పుస్తకంలో ప్రచురించారని, ఆయన చేసిన సాహితీ సేవలకు గుర్తింపుగా నల్లగొండలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్నారు.

ప్రముఖ సాహితీవేత్త సినీ విమర్శకులు డాక్టర్ ఎం.పురుషోత్తమచార్య మాట్లాడుతూ. రచయితగా గొప్ప స్థానాన్ని పొందాలని దళిత స్పర్శ దళిత సాహిత్యాన్ని విస్తృత పరిచారని మానవీయ కోణంలో ఆయన రచనలు అందరికీ స్ఫూర్తిని కలిగించాయన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి పున్న అంజయ్య మాట్లాడుతూ.. బోయ జంగయ్య జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉంటూ జిల్లా మహాసభలను విజయవంతం భావించడంలో ఎంతో కృషి చేశారన్నారు. నిజాయితీతో కూడిన విభజన ఉద్యోగిగా సమాజానికి సేవలందించారని, రచయితగా తన రచనల ద్వారా ఏ విలువల అయితే విలువలకు కట్టుబడ్డ వ్యక్తి బోయ జంగయ్య అన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట తెలుగు శాఖ అధ్యక్షుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ.. రచయితగా అసాధారణ ప్రతిభ కలిగిన వ్యక్తి బోయ జంగయ్య అన్నారు. జిల్లాలో అంతటి ప్రతిభావంతులైన రచయిత జన్మించడం జిల్లాకే గర్వకారణమని తెలిపారు. వారి సమగ్ర సాహిత్యాన్ని తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ సాహిత్య అకాడమీ పైన ఉందని, ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన రచనల ద్వారా తెలుగు సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జీవకవి మునాసు వెంకట్, డాక్టర్ వగడాల నాగేందర్, భూతం ముత్యాలు, డాక్టర్ మహమ్మద్ హసేన, డాక్టర్ సాగర్ల సత్తయ్య, శీలం భద్రయ్య, బండారు శంకర్, దున్న యాదగిరి, దర్శనం అంజయ్య, డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి, ఎలికట్టె శంకర్రావు, దాసరి శ్రీరాములు, బూర్గు గోపికృష్ణ, తరుణోజు భీష్మాచార్య, బోయ జంగయ్య కుమారులు చేతన్, సిద్ధార్థ్, నామా వెంకటేశ్వర్లు, మధుసూదన్ పాల్గొన్నారు.

# ఓటరు సవరణలో తప్పిదాలు జరిగితే సహించం : మాజీమంత్రి తలసాని




హైదరాబాద్, మే 7: ఓటరు సవరణలో తప్పిదాలు జరిగితే సహించబోమని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.ఓటరు మ్యాపింగ్ విధానం, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం తీరును తెలుసుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కులో ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని సూచించారు.

ఎన్ఐఆర్‌లో కార్యక్రమంలో సాంకేతికతపై అనుభవం ఉన్న వారిని నియమించాలని డిమాండ్ చేశారు. సర్‌పై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని,వాటిని నివృత్తి చేయాలని కోరారు. పార్టీ పరంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు , ఓటర్లకు అందుబాటులో ఉండాలని కోరారు.

# టేకులపల్లిలో మొక్కజొన్న రైతుల ఆందోళన

ఖమ్మం, మే 7: మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రైతులు గురువారం ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రం వద్ద 4 రోజులుగా మక్క కొనుగోలు చేయట్లేదని విమర్శించారు. ఎర్రటి ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నా రైతులను పట్టించుకునేవారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు చేసి ఇక్కడ స్టాక్ పెట్టడానికి స్థలం లేదని, కారేపల్లి వద్దకు వెళ్లాలని చెబుతున్నారని రైతులకు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కు తాళం వేశారని, రైతులుకు మంచినీటి సౌకర్యం కుడా లేదని విమర్శించారు. రోడ్డుపై బైఠాయించొద్దని, కేసులైతాయని రైతులతో పోలీసులు అనడంతో కేసులకైనా సిద్ధంగా ఉన్నామని, ఉన్నతాధికారులు రావాలని, మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వాహనాలు ఎక్కడిక్కడ నిలిపోవడంతో టేకులపల్లి ఎస్ఐ అలకుంట రాజేందర్ రైతుల వద్దకొచ్చి సమస్యను పరిష్కరిస్తామనడంతో ధర్నాను విరమించారు. అనంతరం మార్కెట్ యార్డ్ వద్ద తాసీల్దార్ ఎల్.వీరభద్రం, ఏఓ అన్నపూర్ణ, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తామని, స్టాక్ ఎక్కడ పెట్టాలో ప్రయత్నాలు చేస్తున్నమని, కారేపల్లి గోడౌన్ వద్ద నిల్వ చేయడానికి అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. లారీలు రాకపోవడంతో సమస్య తలెత్తుతుందని, రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని, ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించారు.

# అడవికి వెళ్లాలంటే గ్రామ సింహాలు ఉండాల్సిందే

అమరావతి, మే 7:మండలంలో వేసవి సీజన్ ప్రధాన ఉపాధి మార్గమైన తునికాకు సేకరణ నేటి నుండి అధికారికంగా ఐదు కల్లాలలో ప్రారంభమైంది. అటవీ ప్రాంతంపై ఆధారపడి జీవించే గిరిజనులు, గిరిజనేతర్లు కూలీలకు ఈ సేకరణ రూపంలో చేతినిండా పని దొరకనుంది,50 ఆకుల కట్టకు రూ. 3.42, పందెంలో 2, మర్రిగూడెంలో 2, చింతగూడెంలో 1 చొప్పున మొత్తం 5 కల్లాలు ఏర్పాటు చేశారు.

అడవిలో అడవి పందుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలు తీవ్ర భయాందోళనల మధ్య అడవిలోకి వెళ్లాల్సి వస్తోంది. పందుల దాడి నుండి రక్షణ కోసం కూలీలు గ్రామ సింహాలు' గుంపులు గుంపులుగా అరుపులు చేసుకుంటూ .. వెళున్నారు. ఈ సేకరణ ద్వారా వచ్చే ఆదాయం వ్యవసాయ పెట్టుబడులకు, ఇంటి ఖర్చులకు ఊరటనిస్తుందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలి



ఆదిలాబాద్, మే 7: రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని తాండూర్ సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి కోరారు. మండలంలోని తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు ప్రైవేట్ వారిని, దళారులను ఆశ్రయించకుండా పీఏసీఎస్ కేంద్రాల్లోనే విక్రయించి లబ్ది పొందాలని కోరారు.

ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం తూకం, రవాణా సౌకర్యాలు కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. లారీలు సమయానికి అందుబాటులో ఉంచి ధాన్యం తరలింపులో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు త్వరితగతిన జరగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావార్ బొలిశెట్టి పద్మజ, పీఏసీఎస్ సెక్రటరీ అనిల్ కుమార్, పాలకవర్గం సభ్యులు, అధికారులు నాయకులు, పీఏసీఎస్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హైడ్రా అమలుకు ఫిర్యాదులు : కమిషనర్ రంగనాథ్

నల్గొండ, మే 7:ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హైడ్రా అమలు చేయాలని ఫిర్యాదులు అందుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. జిల్లాలోని మిర్యాలగూడలో ఆయన మీడియాతో మాట్లాడారు.

హైదరాబాదులో 10 లక్షలకు కోట్ల విలువచేసే భూములు అన్యక్రాంతం అయ్యాయని, వీటిలో 2,100 ఎకరాల చెరువులు , పార్కులు, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. హైడ్రాకు ఇప్పటవరకు 30 వేల ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఇటీవల అమీన్‌పూర్‌లో ముఖీమ్ సంధ్య శ్రీధర్ రావు, మల్లారెడ్డికి సంబంధించిన భూములను సైతం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఇటీవల కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు చట్ట ప్రకారమే ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్ ప్రతిపక్షాలకు సంబంధించిన అక్రమ కట్టడాలను సైతం కూల్చివేశామని వివరించారు. ప్రస్తుతం హైదరాబాదులో 25 చెరువులు స్వాధీనం చేసుకున్నామని, మరో 100 చెరువులు స్వాధీనానికి ప్రణాళిక రూపొందించామన్నారు.

ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు వాకింగ్ ట్రాక్, ఫిజికల్ యాక్టివిటీస్ పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇవన్నీ రెండు సంవత్సరాల లోపు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

# దేశమంతటా ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలల నిర్మాణంలో పురోగతిపై కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి సమీక్ష



న్యూఢిల్లీ, మే 7:దేశవ్యాప్తంగా ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల (ఈఎమ్ఆర్ఎస్)ల నిర్మాణంలో పురోగతిని సమీక్షించడానికి ఏర్పాటు చేసిన ఒక ఉన్నత స్థాయి సమావేశానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ జువల్ ఒరామ్ అధ్యక్షత వహించారు.

ఈ సమావేశాన్ని గిరిజన వ్యవహారాల శాఖ నిర్వహించింది. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లు, కేంద్ర ప్రజా పనుల విభాగం (సీపీడబ్ల్యూడీ)ల సీఎమ్‌డీలు, ఎమ్‌డీలు, సీనియర్ అధికారులతో పాటు అస్సాం, ఛత్తీస్‌గఢ్, మేఘాలయ, మిజోరమ్, ఒడిశా, రాజస్థాన్, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రతినిధులు దృశ్య మాధ్యమ పద్ధతిలో పాల్గొన్నారు.

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలుచేస్తున్న పథకాల్లో ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల (ఈఎమ్ఆర్ఎస్)లు ఒక ప్రధాన పథకం. ఈ పథకాన్ని దూర ప్రాంతాల్లోని షెడ్యూల్డు తెగ (ఎస్‌టీ)ల విద్యార్థులకు ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు నాణ్యమైన ఆశ్రమ విద్యను బోధించడానికి ఉద్దేశించారు. గిరిజన బాలబాలికల్లో విద్య పరమైన అంతరాల్ని తొలగించి, వారి సమగ్ర వికాసాన్ని ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం.

గిరిజన బాలబాలికల సమగ్ర వికాసంలో భాగంగా వారికి విద్యాబుద్ధులు చెప్పి, క్రీడలలో ఆసక్తిని పెంచి, వారిలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతారు.

ఈఎమ్ఆర్ఎస్ నిర్మాణ పనుల్లో భౌతిక పురోగతినీ, ఆర్థిక సహాయం సంబంధిత పురోగతినీ గౌరవ కేంద్ర మంత్రి విస్తృత స్థాయిలో సమీక్షించారు. సమావేశంలో సీపీడబ్ల్యూడీ, హెచ్ఎస్‌సీఎల్, టీసీఐఎల్, డబ్ల్యూఏపీసీఓఎస్, బీ అండ్ ఆర్, ఈపీఐఎల్, ఎమ్ఏఎన్ఐడీసీఓ, ఎమ్‌టీడీసీ, ఎన్‌పీసీసీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల వంటి ప్రధాన కార్యాచరణ సంస్థలు తమ పనుల్లోని ప్రగతిని గురించి, ఆయా పనులను పూర్తి చేయడానికి ఖరారు చేసిన గడువులను గురించి వివరించాయి.

ఏజెన్సీవారీ, రాష్ట్రం వారీ పనితీరును సమీక్షించారు. దీనిలో భాగంగా గడువు, నాణ్యత ప్రమాణాలు, ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంపైన కూడా దృష్టిని కేంద్రీకరించారు.

దూర ప్రాంతాల, ప్రయోజనాలను పూర్తి స్థాయిలో అందుకోలేకపోతున్న ప్రాంతాల్లో గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలలది కీలక పాత్ర అనీ, ఈ కారణంగా ఈ పాఠశాలల పనులను సకాలంలో పూర్తి చేయడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సివుందనీ గౌరవ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పీఎస్‌యూలు, సీపీడబ్ల్యూడీ, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు సహా అన్ని కార్యాచరణ ఏజెన్సీలు ప్రాజెక్టు స్థలాల్లో జనశక్తితో పాటు వనరుల్ని కూడా సమర్థంగా వినియోగించుకుంటూ నిర్మాణ పనుల్ని త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆయన ఆదేశాలిచ్చారు. పనులను దగ్గరుండి పర్యవేక్షించడానికి తరచుగా క్షేత్ర పర్యటనలను చేపట్టాలని సీనియర్ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయిలో పరిష్కారం కాకుండా మిగిలిపోయిన అంశాలన్నిటినీ ప్రాధాన్యం ప్రాతిపదికన పరిష్కరించాల్సిందిగా గౌరవ కేంద్ర మంత్రి రాష్ట్రాల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ అంశాల్లో భూమి, అడవులకు సంబంధించిన క్లియరెన్సులు కూడా ఉన్నాయి. ఈఎమ్ఆర్ఎస్ వారీ అంశాలతో పాటు, పనులను అనుకున్న సమయానికే పూర్తి చేయడానికి సంబంధించిన కార్య ప్రణాళికలు సహా అన్ని వర్తమాన ప్రాజెక్టులకు చెందిన తాజా వివరాలతో కూడిన నెలవారీ ప్రగతి నివేదికలను మంత్రిత్వ శాఖకూ, నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీఎస్)కూ సమర్పించాల్సిందని నిర్మాణ ఏజెన్సీలను ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల్లో జాప్యం జరిగితే సంబంధిత నిర్మాణ ఏజెన్సీని బాధ్యులను చేయనున్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గౌరవ కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలలు ఒక పరివర్తన పూర్వక కార్యక్రమమనీ, ఈ కార్యక్రమం ఉద్దేశం గిరిజనుల పిల్లలకు అధిక నాణ్యత కలిగిన ఆశ్రమ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చి వారికి సాధికారతను కల్పించడమనీ ఆయన వివరించారు. వికసిత్ భారత్‌ను 2047 కల్లా సాధించాలనేదే గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృష్టి కోణమని గౌరవ కేంద్ర మంత్రి గుర్తు చేశారు. దీనిలో సమ్మిళిత అభివృద్ధికీ, సమానావకాశాలను అందించడానికీ విశేష ప్రాధాన్యం ఉందని చెప్పారు. దేశ నిర్మాణంలో గిరిజన యువత చురుకైన భాగస్వామ్యాన్ని పంచుకోవాలంటే గిరిజన ప్రాంతాల్లో విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అత్యంత ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందనీ, దీంతో అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధ, సాధికార పూర్వక భారత్ దిశగా పయనించగలమనీ మంత్రి అన్నారు.

గిరిజన మంత్రిత్వ శాఖ ప్రధాన పథకాల్లో ఈఎమ్ఆర్ఎస్ ఒకటని ఆ శాఖ కార్యదర్శి శ్రీమతి రంజనా చోప్రా అన్నారు. అప్రోచ్ రోడ్లు, నీటి ఎద్దడి, హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్తు లైన్లను వేరే ప్రాంతాలకు మార్చాల్సి రావడం వంటివి ఈ ప్రాజెక్టు పురోగతిపై ప్రభావం చూపుతున్న అంశాలనీ, వీటిని అతి త్వరగా పరిష్కరించడంపై శ్రద్ధ తీసుకోవాలనీ ఆమె స్పష్టం చేశారు. ఈ సమస్యల్ని నిర్ణీత కాలంలో పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో, జిల్లా అధికార యంత్రాంగాలతో సన్నిహిత సమన్వయాన్ని నెలకొల్పుకోవాల్సిందిగా కార్యాచరణ ఏజెన్సీలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈఎమ్ఆర్ఎస్ ప్రాజెక్టుల విషయంలో పీఎమ్ గతి శక్తి పోర్టల్‌ను ఉపయోగించుకోవచ్చని సూచించారు.

నిర్మాణ పనుల సమగ్ర స్థితితో పాటు పనులు పూర్తి చేయడానికి సంబంధించిన నిర్ణీత కార్య ప్రణాళికను నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీఎస్) కమిషనరు డాక్టర్ ప్రతిమా వర్మ సమావేశంలో వివరించారు. మంత్రిత్వ శాఖ 728 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలలకు ఆమోదం తెలిపిందనీ, వాటిలో 428 పాఠశాల భవనాల నిర్మాణం పూర్తయిందనీ, 249 పాఠశాల భవనాల నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయనీ సమావేశం దృష్టికి ఆమె తీసుకువచ్చారు. 46 పాఠశాల భవనాలు పూర్వ నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. వేగవంతమైన కార్యాచరణనీ, నాణ్యతా పూర్వక నిర్మాణాన్నీ నిర్ధారించడానికి ఎన్ఈఎస్‌టీఎస్ తీసుకున్న చర్యల్ని కూడా ఆమె ప్రస్తావించారు.

గిరిజన వ్యవహారాల శాఖలో ఈఎమ్ఆర్ఎస్ సంయుక్త కార్యదర్శి శ్రీ బి.ఎన్. ప్రసాద్ వందన సమర్పణ చేయడంతో, సమావేశాన్ని ముగించారు.

# అకాల వర్షాలతో దిక్కుతోచని స్థితిలో రైతులు : జూలకంటి రంగారెడ్డి



నల్గొండ, మే 7:: రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి సెంటర్లను తెరచి 40 రోజులవుతున్నా, రైతులు సెంటర్లకు ధాన్యాన్ని తెచ్చి 50 రోజులవుతున్నా కాంటాలు కాక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే కాంటాలు పెట్టి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు.

బుధవారం అర్వపల్లి మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్లను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి రైతుల ఆవేదనను ఆలకించి మాట్లాడారు. ఐకెపి సెంటర్లలో పోసిన ధాన్యం సుమారు 50 రోజులవుతున్నా కాంటాలు పెట్టక వాతావరణ పరిస్థితులు అకాల వర్షాలు వస్తున్న సందర్భంగా ఆరుగాలం కష్టం చేసి పండించిన వడ్లకు కోనే దిక్కులేక పరిస్థితి తట్టుకోలేని రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్య వైఖరితో మిల్లర్ల సెంటర్ నిర్వాహకుల అవకతవకుల కారణంగా ఆలస్యమవుతుందని విచారణ వ్యక్తం చేశారు. రైతే రాజు అని చెప్పుకుంటూ కనీసం రైతుల వైపు కానీ రైతు పండించిన పంట వైపు గాని చూడకుండా కాలయాపన చేస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేసే స్థితిలో లేదన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే కాంటాలు వేగవంతం చేసి వెంటనే రైతుల అకౌంట్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని చెబుతూ కనీసం రైతు పండించిన పంటను కొనుగోలు చేయలేని దుస్థితిలో ఉన్నదని అధికారులు మిల్లర్లు కలిసి రైతులను మోసం చేసి దగా చేస్తూ ఒడ్లు బాగాలేవని తక్కువ చేసి దిగుమతి చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకవైపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు విషయంలో వెంటనే కాంటాలు పెడుతున్నామని చెబుతున్నా దానికి విరుద్ధంగా ఐకెపి సెంటర్‌లో రైతులు ఎండలో మంచినీరు లేక ధాన్యాన్ని పట్టాలు కిరాయి తెచ్చుకుని ఎన్నో రోజులు అవుతున్నా కాంటాలు పెట్టక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా స్పందించి పది రోజుల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు డబ్బు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నమ్మాలి వెంకటేశ్వర్లు, కోట గోపి, పులుసు సత్యం, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్ రెడ్డి, వజ్జ శ్రీనివాస్, గండ వెంకట్ రెడ్డి, రజిత, సంపత్, వెంకన్న, నిమ్మల కోటి, అబ్బులు, కొమ్ము విజయకుమార్, బొడ్డు సైదులు, కనుక మల్లేష్, కోటమర్తి సుజాత, దేవులపల్లి వీరారెడ్డి, మర్రి సైదులు, సంపత్ రాజు, సైదయ్య, వీరయ్య, సాయికుమార్, రామావత్ రాములు, ఎల్లవుల ఆవులయ్య, శిఖ రవికుమార్, మద్ది రాజయ్య, బొల్లం గోవయ్య, అరిగ వీరస్వామి, రావుల వెంకన్న, వినయ్ కుమార్, కొప్పు సరోజ, బొల్లం జానయ్య, సిగ శ్రీనివాస్, పనస భద్రయ్య పాల్గొన్నారు.

# ఆలేరులో నిలిచిన అభివృద్ధి

- రెండున్నరేళ్లుగా ఐలయ్య ఫొటోల ఫోజులకే పరిమితం
- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

నల్గొండ, మే 7:ఆలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం ఫొటోలకు ఆయన ఫోజులు ఇస్తూ కాలం గడుపుతున్నారని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆరోపించారు. గురువారం రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు భారీ హామీలు ఇచ్చిన ఎమ్మెల్యే ఐలయ్య, వాటి అమలులో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో కూడా లేకుండా పోయారన్నారు. రాజాపేట మండలానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం 15వ ప్యాకేజీ కింద కాల్వల పనులను సగం వరకు పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తానని ఐలయ్య హామీ ఇచ్చినా, రెండున్నరేళ్లు గడిచినా ఒక్క అడుగు ముందుకు పడలేదని మండిపడ్డారు.

సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెలరోజులు గడిచినా కేవలం 20 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించకపోవడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల రైతులు రోజుల తరబడి ధాన్యం అమ్ముకునేందుకు ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. రైతుల పాలిట ఈ ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, మూడు విడతల రైతు భరోసా నిధులను విడుదల చేయకుండా మూడు సార్లు ఎగ్గొట్టిందన్నారు. రైతులు రాత్రింబవళ్లు ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

అలాగే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ సందిళ్ల భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, చింతలపూరి వెంకట్రాంరెడ్డి, ఎర్రగోగుల జశ్వంత్, ఎడ్ల నరేష్ రెడ్డి, సర్పంచులు చింతల సంపత్, బొడ్డు భాస్కర్, గోపిరెడ్డి, నరేష్ రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం..

–ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే పందికుంట వెంకట ప్రసాద్



అమరావతి, మే 7: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొంటూ గాండ్లపెంట మండలం గొడ్డువెలుగుల పంచాయతీలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధి కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. గ్రామ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుగా విని పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, కొత్త పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్ సమస్యలు వంటి పలు అంశాలపై అర్జీలు సమర్పించారు. ప్రజలు అందించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రజాప్రతినిధి, సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి మెజారిటీ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించారు. దీర్ఘకాలిక సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడం, వారి వద్దకే వెళ్లి సమస్యలను వినడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లే లక్ష్యంతోనే 'ప్రజా దర్బార్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం అయ్యే వరకు తన కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రియల్ టైమ్ గవర్నెన్స్‌ను బలోపేతం చేసేందుకు, చివరి వ్యక్తి వరకూ సేవలు అందించేందుకు సెంట్రల్ ప్రభారీ ఆఫీసర్ (సీపీవో) పోర్టల్‌ను ప్రారంభించిన నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, మే 7:ఆకాంక్షాత్మక జిల్లాలు, బ్లాకుల కార్యక్రమం (ఏడీపీ/ఏబీపీ) పరిధిలో రియల్ టైమ్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడం, భాగస్వాముల మధ్య సమన్వయాన్ని పెంచడం, చివరి వ్యక్తి వరకు సేవలను వేగంగా అందించడమే లక్ష్యంగా సెంట్రల్ ప్రభారీ ఆఫీసర్ (సీపీవో) వెబ్ సైటును నీతి ఆయోగ్ ఈ రోజు ప్రారంభించింది.

ఈ వెబ్ సైటును నీతి ఆయోగ్ సీఈవో నిధి చిబ్బర్ అధికారికంగా ప్రారంభించారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులు, కేంద్ర ప్రభారీ అధికారులు, ప్రణాళికా కార్యదర్శులు, జిల్లా న్యాయాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో ప్రసంగించారు. అత్యంత విశ్వసనీయమైన, పారదర్శకమైన, స్పందించే పరిపాలనా వ్యవస్థను నిర్మించే దిశగా చేపట్టిన కీలక చర్యను సీపీవో వెబ్ సైటు సూచిస్తుందన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలను ఎప్పటికప్పుడు సమర్పించడానికి, పర్యవేక్షించడానికి ఈ వేదిక వీలు కల్పిస్తుందనీ, తద్వారా క్షేత్ర స్థాయి నుంచి అందిన సమాచారం విధానపరమైన, పరిపాలనాపరమైన చర్యలకు నేరుగా సహాయపడుతుందని తెలిపారు.

డేటా ఆధారిత పరిపాలన ప్రాధాన్యం, క్షేత్ర స్థాయి సమాచారాన్ని అందించడంలో కేంద్ర ప్రభారీ అధికారులు (సీపీవో) పోషించే కీలకపాత్ర గురించి నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి, ఏడీపీ/ఏబీపీ మిషన్ డైరెక్టర్ శ్రీ రోహిత్ కుమార్ వివరించారు. పాలనలోని అన్ని స్థాయిల్లోనూ వాస్తవ సమయంలో పరిశీలనలను సంగ్రహించడం, సమాచార ప్రసారాన్ని క్రమబద్ధీకరించడం, పరిపాలనాపరమైన స్పందనను వేగవంతం చేయడం కోసం అధునాతన డిజిటల్ వేదికగా సీపీవో పోర్టల్‌ను తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు.

ఈ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ల నుంచే క్షేత్ర స్థాయిలో తమ పరిశీలనలను, సిఫారసులను సెంట్రల్ ప్రభారీ అధికారులు సమర్పిస్తారు. అనంతరం ఈ సమాచారం అందుబాటులోకి వస్తుంది. సీపీవోలు ఇచ్చిన సూచనలను జిల్లాలు స్వీకరించి, తగిన చర్యలు చేపట్టి, తదనుగుణంగా తమ స్పందనలను సమర్పించవచ్చు. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శులు సమగ్రంగా పరిశీలిస్తారు. సూచనలను అమలు చేసి, తమ అభిప్రాయాలను నమోదు చేసేలా వివిధ విభాగాలతో సమన్వయం చేసుకుంటారు. అదే సమయంలో నీతి ఆయోగ్ అధికారులు, సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఈ సమాచారాన్ని పర్యవేక్షిస్తాయి.

# సామాజిక సేవలకు ప్రతిరూపం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్



ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరు రాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించ దగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్ ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందు కున్నారు. గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్.ఎల్.బి పూర్తిచేసింది. న్యాయశాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు.

ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు.

భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు. 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు.

ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్ గా పిలిచేవారు.

అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించ బడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు,అనాధ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు. రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు.

లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీ లను స్థాపించారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు.

1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు.

దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు.

1971లో సాక్షరతా భవన్ ని ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 – నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు.

అనవమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.

మే 8... దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వర్ధంతి



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# పీఎం కుసుం పథకం ఎవరిది..? పీఎం ఫోటో పెట్టరా...?

**అధికారుల , ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపీటీసీ రంగు రంగు భాస్కరాచారి...**



కరీంనగర్, మే 7:(నేటినిజం ప్రతినిధి) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారము ప్రోగ్రాంలో భాగంగా గురువారం రోజున గంగిపల్లి గ్రామంలో ధన లక్ష్మి దాన్య విత్తన రైతు పరస్పర సహకార పరిమిత సంఘం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక మాజీ ఎంపిటిసి రంగు భాస్కరాచారి అధికారుల తీరుపై మండిపడ్డారు. వ్యవసాయ క్షేత్రాలు., సౌర విద్యుత్ కేంద్రాలు (పీఎం కుసుం పథకం) అంశంపై సమావేశం చేపట్టినప్పుడు , ఆ పథకాన్ని ప్రవేశపెట్టింది ఎవరు.. ఆ పథకం ద్వారా నిధులు అందిస్తుంది ఎవరు.. అనే విషయంపై అధికారులకు అవగాహన లేదా.. అని రంగు భాస్కరాచారి ప్రశ్నించారు. పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతో పీఎం కుసుం పథకం అమలవుతుందని, అలాంటప్పుడు కనీసం దేశ ప్రధాని ఫోటో పెట్టక పోవడం అధికారులకు తగదన్నారు. పీఎం కుసుం పథకం ద్వారా పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతో రైతులకు సోలార్ పంపుసెట్లు సబ్సిడీతో అందిస్తుందని ఆయన తెలిపారు. అలాంటి గొప్పనైన పథకం అమలు చేయడానికి , విధివిధానాలు తెలియజేయడానికి సమావేశం ఏర్పాటు చేసినప్పుడు , ఆ పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం, పీఎం నరేంద్ర గురించి చెప్పకపోవడం, ప్రోగ్రాం బ్యానర్లో పీఎం ఫోటో పెట్టకపోవడం భావ్యం కాదన్నారు. అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తులుగా మారారని రంగు భాస్కరాచారి ఘాటు వ్యాఖ్యలు చేసి, సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు.

# అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న శివాలయ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

**–విస్సన్నపేటలో వెంపటి శ్రీకృష్ణ జనార్దన్ రావును కలిసిన కొలికపూడి శ్రీనివాసరావు**
**–ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచన**
**–త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్ష**

అమరావతి, మే 7:ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట పట్టణంలో బ్రెయిన్ ఆపరేషన్ అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విస్సన్నపేట శివాలయం చైర్మన్ వెంపటి శ్రీకృష్ణ జనార్దన్ రావును గౌరవ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు గురువారం వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జనార్దన్ రావు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

వైద్యులు సూచించిన జాగ్రత్తలను కచ్చితంగా పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మనోధైర్యంతో త్వరలోనే పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే శ్రీకృష్ణ జనార్దన్ రావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులతో సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని కోరుకు న్నారు. ఈ పరామర్శ కార్యక్ర మంలో స్థానిక నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ..

అమరావతి, మే 7:ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అలాంటి భాదితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నిజంగా ఒక వరం అని తెదేపా నాయకులు అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి రూ.7.40 లక్షల చెక్కులను విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ సహకారంతో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

నాటి ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి ఉందని,నేడు కూటమి ప్రభుత్వంలో వేల కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నామంటే అది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతే అని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు, దిరిశాల వెంకటకృష్ణారావు, దేవభక్తుని సీతారాంప్రసాద్, గువ్వల వెంకటేశ్వరరెడ్డి, కొత్తా రజినీకాంత్, బొల్లా కరుణాకర్, పి.రాంబాబు, కోట వెంకటేశ్వరరావు, బెల్లం మధుసూదన్ రావు, ఇనుగంటి మధుసూదన్, జంగా చెంచురెడ్డి, పాల్గొన్నారు.

# దివ్యాంగులకు రూ.84 లక్షల ఉపకరణాలు

**- అవయవ లోపం బలహీనత కాదు- సిరిసిల్లలో కేంద్ర మంత్రి బండి సంజయ్**



రాజన్న సిరిసిల్ల, మే 7:(నేటినిజం ప్రతినిధి): అవయవ లోపాన్ని బలహీనతగా కాకుండా జీవితాన్ని గెలిచే శక్తిగా భావించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. కాళ్లు, చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారు ఉన్నారని, చూపులేకపోయినా కోట్లాది మందికి వెలుగునిచ్చిన వారు ఉన్నారని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఆర్థిక సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో 466 మంది దివ్యాంగులకు రూ.84 లక్షల విలువైన 813 ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే మూడు రెట్లు అధిక బడ్జెట్ కేటాయిస్తున్నామని ఏడీఐపి, ఏఎల్ఐఎంసీవో పథకాల ద్వారా ఉపకరణాలు, విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీలు, పిల్లల సంక్షేమం కోసం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. "మనిషి శరీరంతో కాదు.. మనసుతో గెలుస్తాడు. మీ పరిమితిని నిర్ణయించేది శరీరం కాదు.. ఆత్మవిశ్వాసం'' అని దివ్యాంగులకు ధైర్యం చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ త్వరలో ఉపకరణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఐఓసీఎల్ సీజీఎం వినీత్ కౌర్, డీఆర్డీవో పద్మయ్య, చందన్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభకు భారీగా తరలిరండి

**–జిల్లా బీజేపీ శ్రేణులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు**



రాజన్న సిరిసిల్ల, మే 7: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు సిరిసిల్ల జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఒక్క కరీంనగర్ జిల్లా నుండే 800 కార్లు 200 బస్సుల్లో జన సమీకరణ చేస్తున్నారని, సిరిసిల్ల జిల్లా నుండి సైతం అంతకు మించి సమీకరించాలని కోరారు. మండలాలు, గ్రామాల వారీగా స్వచ్ఛందంగా ప్రజలు మోదీని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని వారికి తగిన రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి భారీ ఎత్తున బీజేపీ నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని సభకు జన సమీకరణపై ఆయా నేతలతో బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటేప్రియ తమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్ తరువాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారు. 3వ సారి ప్రధాని పగ్గాలు చేపట్టిన తరువాత హైదరాబాద్ తొలిసారి రాబోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి బీజేపీ కార్యకర్త స్వచ్ఛందంగా తరలిరావాలి. కరీంనగర్ జిల్లా నుండి వేల సంఖ్యలో జన సమీకరణ చేద్దాం. వేలాది సంఖ్యలో ప్రజలను పరేడ్ మైదానానికి తరలిద్దాం. బీజేపీ నాయకులంతా తమ అనుచరులు, టీంతో తప్పనిసరిగా పరేడ్ మైదానానికి తరలి రావాలి. ప్రతి ఒక్కరూ మోదీ సభకు ఆహ్వానిస్తూ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలి. మీ గ్రామాలు, వార్డులు, మండలాల పరిధిలో వాల్ రైటింగ్ రాయించండి. సభకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్న వారికి తగిన రవాణా, భోజన సౌకర్యాలు కల్పించాలి. మోదీ సభ సక్సెస్ తో రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం తథ్యమనే సంకేతాలు పంపుదాం. అట్లాగే ఈనెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ లో నిర్వహించే హిందూ ఏక్తా యాత్రకు సైతం జిల్లా నుండి భారీ ఎత్తున హిందువులంతా హాజరయ్యేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు ఎర్రం మహేష్, చెన్నమనేని వికాస్ రావు, అల్లాడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను గోస పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

**–వెంటనే కొనుగోళ్ళు వేగవంతం చేయాలని బిజెపి**



కరీంనగర్, మే 7:(నేటినిజం ప్రతినిధి). ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం గోసపెడుతుందని బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. గురువారం బిజెపి కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు రేమిడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేశవపట్నం మార్కెట్ యార్డ్ ను సందర్శించిన బిజెపి నాయకులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన రైతుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఆర్భాటంగా ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు కొనుగోళ్ళు జరిగేందుకు మాత్రం తగు ఏర్పాట్లు చేయలేదని ఎద్దేవా చేశారు. ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకుపోతుప్పటికీ తూకం వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఒకవైపు వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతుండగా పది రోజులు దాటినా కూడా ధాన్యం తూకం వేయడం లేదని, కొనుగోలు కేంద్రాలలో హమాలీ, రవాణా, టార్పాలిన్ వంటి సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తరుగు పేరుతో 42 కిలోల పైనే తూకం వేస్తున్నారని, గ్రేడ్ ఏ ధాన్యాన్ని కూడా కామన్ కింద దిగుమతి చేసుకుంటు రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు నిద్రావస్థలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం మరియు ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాలలో సమస్యలు లేకుండా చూడాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గద్దపాక ఉప సర్పంచ్ జంగ జైపాల్, నాయకులు దొంగల రాములు, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, నిమ్మశెట్టి సంపత్, మాందాడి జగ్గారెడ్డి, చెర్ల శ్రీనివాస్, బిజికి సారయ్య, గొల్లిపెల్లి వెంకటేషం, గిద్దెమారి నర్సయ్య, కుర్రె అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్‌డీ ఇండియా మాధురీ దీక్షిత్‌తో దేశవ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమం

హైదరాబాద్, మే 7:ఎంఎస్‌డీ (యునైటెడ్ స్టేట్స్ మరియు కెనడాలో మెర్క్ అండ్ కంపెనీ, ఇంక్., రాహ్వే, ఎన్.జె., యుఎస్‌ఎగా ప్రసిద్ధి పొందింది) ఈ రోజు భారతదేశంలో తన సర్వైకల్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది.

ఈ కార్యక్రమం ప్రముఖ నటి, ప్రజా వ్యక్తిత్వం మరియు తల్లి మాధురి దీక్షిత్ నేనే సహకారంతో నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం లక్ష్యం మహిళల నివారణాత్మక ఆరోగ్యంపై చర్చలను ముందుకు తీసుకురావడం, దేశవ్యాప్తంగా మహిళలు , తల్లిదండ్రులు సర్వైకల్ క్యా



న్సర్, దాని నివారణకు సంబంధించిన సరైన ఆరోగ్య ఎంపికల గురించి తమ వైద్యుల తో మాట్లాడేందుకు ప్రోత్సహించడం.సర్వైకల్ క్యాన్సర్ భారతదేశంలో మహిళలను ప్రభావితం చేసే అత్యంత సాధారణ క్యాన్సర్లలో ఒకటిగా ఉంది (2). సమయానికి వైద్యుల సలహా తీసుకోవడం మరియు సరైన నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని చాలా వరకు నివారించవచ్చు (3), అయినప్పటికీ భారతదేశంలో ప్రతి ఏడు నిమిషాలకు దాదాపు ఒక మహిళ మరణిస్తోంది, అంటే ప్రతి రోజూ సుమారు 200 మరణాలు జరుగుతున్నాయి (1) (గ్లోబోకాన్ హెచ్‌పీవీ ఇండియా రిపోర్ట్ 2023 ప్రకారం డేటా). ఈ ప్రచారం ముఖ్యంగా మహిళల్లో అవగాహనలో ఉన్న లోపాలు, నివారణాత్మక ఆరోగ్య సేవలను ఆలస్యం చేసే ప్రవృత్తిని ఎదుర్కొనేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం భాగంగా, మాధురీ దీక్షిత్‌ను ప్రధానంగా చూపిస్తూ చిన్న చిన్న డిజిటల్ వీడియోల శ్రేణిని వివిధ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లలో విడుదల చేశారు. సులభంగా అర్థమయ్యే, వాస్తవాల ఆధారంగా ఉన్న సమాచారం అందించే సందేశాల ద్వారా ఈ వీడియోలు సర్వైకల్ క్యాన్సర్ గురించి ముఖ్యమైన విషయాలు, అది హ్యూమన్ పాపిలోమావైరస్ (హెచ్‌పీవీ) (2)తో ఉన్న సంబంధం, అలాగే ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవాల్సిన అవసరాన్ని వివరంగా తెలియజేస్తాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com